### అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్, అల్లాహ్ తాలా దయతో క్షేమంగా యున్నారు. **(అల్ హందులిల్లాహ్)**

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి ఆయురారోగ్యముల కొరకు, ఉన్నత ఆశయ సాధనలు మరియు వారి ప్రత్యేక రక్షణకై దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా అనుక్షణం హుజూర్ ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

اَللّٰھُمَّ اَیِّدْ اِمَامَنَا بِرُوْحِ الْقُدُسِ
وَبَارِكْ لَنَا فِیْ عُمُرِہٖ وَاَمْرِہٖ


بِسْمِ اللّٰہِ الرَّحْمٰنِ الرَّحِیْمِ نَحْمَدُہٗ وَنُصَلِّیْ عَلٰی رَسُوْلِہِ الْکَرِیْمِ وَعَلٰی عَبْدِہِ الْمَسِیْحِ الْمَوْعُوْد

وَلَقَدْ نَصَرَكُمُ اللّٰہُ بِبَدْرٍ وَّاَنْتُمْ اَذِلَّۃٌ (ఆలె ఇమ్రాన్:124)

**సంపాదకులు:** సయ్యద్ రసూల్ నియాజ్

**ఉపసంపాదకులు:** ముహమ్మద్ అక్బర్

# బదర్

తెలుగు వార పత్రిక

Weekly **BADAR** Qadian **Telugu**

సంపుటి 4

సంచిక 31

వార్షిక చందా 500/-రూ॥

www.akhbarbadrqadian.in

**01 ఆగష్టు 2019, 28 జుల్ ఖాయిదా 1440, హి.ఖ, 01 జహూర్ 1398, హి.శ.**


### పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

وَلْتَكُنْ مِّنْكُمْ اُمَّةٌ يَّدْعُوْنَ اِلَى الْخَيْرِ وَيَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ۝

"మీలో కొందరు ఒక సంఘముగా ఏర్పడి ప్రజలను ఉత్తమత్వమువైపు ఆకర్షించి ఉత్తమత్వమును నేర్పి దౌష్టము నుండి దూరముగా ఉండునట్లు చేయవలెను. ఇట్టి వారికే విజయము చేకూరును." (ఆలే ఇమ్రాన్: 105)

**ఏ విధముగానైతే నేటి కాలంలో ఎక్కడైతే తప్పిపోయిన ధార్మిక నిదర్శనములు లభించాయో, అదే విధముగా తప్పిపోయిన భాషల తల్లి కూడ అరబి భాషయే అనే విషయమును అక్కడే వారు తెలుసుకొందురు.**

**ఉపదేశము: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం**

### అరబి భాష గొప్పతనం:

అరబి నిఘంటువు కూడ అద్భుతమైనది. పోరాటం కూడ దాని వద్దనే ఆగిపోతుంది. గతంలో పేర్కొన్న రిబాత్ అనే పదం ప్రాపంచిక యుద్ధాలు, పోరాటాలు, యుద్ధ నైపుణ్యాలు, తత్వాలపై ఆధారపడి యున్నట్లే ఆధ్యాత్మిక పరంగా అంతర్గత యుద్ధం, మనస్సుతో జరుగు పోరాటంను గూర్చిన వాస్తవాన్ని, విశిష్టతలను గూర్చి బహిర్గతం చేస్తుంది. ఇదొక విచిత్ర పరంపర. అందుకే అరబి భాషను అన్ని బాషలకు తల్లిగా వర్ణించడం జరుగుతుంది. ఇతర భాషలతో సాధ్యం కాని ఎన్నో పనులు ఈ భాష ద్వారా పూర్తి అవుతాయి. అరబి భాష ప్రాధాన్యతను, అన్ని భాషలకు మాతృభాష అరబియేనని నిరూపించుటకు నేను కొన్ని రోజుల క్రితమే రచనను ప్రారంభించిన మిననుర్రహ్మాన్‌లో ఇన్షా అల్లాహ్ ఈ వివేకములు ఎంతో స్పష్టముగా, చక్కగా, సూక్ష్మంగా వివరించబడును. యూరప్ ప్రజల అన్వేషణ అసంపూర్తిగా, అస్పష్టముగా ఉన్నదని తెలుస్తుంది. ఏ విధముగానైతే నేటి కాలంలో ఎక్కడైతే తప్పిపోయిన ధార్మిక నిదర్శనములు లభించాయో, అదే విధముగా తప్పిపోయిన భాషల తల్లి కూడ అరబి భాషయే అనే విషయమును అక్కడే వారు తెలుసుకొందురు. మొత్తానికి అరబి భాష నిఘంటువు ప్రాపంచిక పరంగా, ఆధ్యాత్మిక పరంగా తన వైభవాన్ని ప్రదర్శిస్తుంది. అందుకే ప్రాపంచిక విషయాలు, అంశాలు బాహ్యముగా మన దృష్టికి వస్తుంటాయి. అందుకే మనం వాటి వాస్తవాన్ని, ఆంతర్యాన్ని ఎంతో సులువుగా, స్పష్టముగా మనకు అర్థమవుతాయి. కావున వాటిని అంచన వేసుకుంటూ ఆధ్యాత్మిక పరంపర, ఆధ్యాత్మిక అంశాల తత్వంను గ్రహించుటలో కష్టమేమి ఉండదు. ఈ అంధాకార, మార్గభ్రష్ట కాలంలో వివేకమనే తేజస్సును అకాశం నుండి అవతరింపజేయడం అల్లాహ్ తాలా యొక్క ప్రత్యేక అనుగ్రహం, కృపయే అనబడును. తద్వారా దారి తప్పిన వారికి మార్గము చూపబడును. ఇప్పటి వరకు గోప్యముగా ఉన్న విధానం మరియు ఆంతర్యము ఏమిటి?. అది అరబి భాషతత్వం, పుట్టు పూర్వోత్తరాల ప్రక్రియ. దేవుని అనుగ్రహాన్ని గౌరవించువారు, దానిని పొందుటకు సిద్ధముగా ఉండువారు అదృష్టవంతులు.

### నేడు కలం ఆవశ్యత అధికముగా గలదు:

నేడు ఖడ్గముతో గాకుండ కలంతోనే అధికముగా అవసరమున్నదని నిశ్చయముగా తెలుసుకొనుడు. మన వ్యతిరేకులు సైన్స్ మరియు ఇతర అంశాల ద్వారా ఇస్లాంపై అనుమానాలను సృష్టించి, అల్లాహ్ తాలా సత్య ధర్మముపై దాడి చేయాలని చూస్తున్నారు. కావున నేను కలం అనే ఆయుధంను ధరించి అభివృద్ధి చెందుతున్న సైన్స్ మరియు విజ్ఞాన మైదానంలో నిలబడి, ఇస్లాం యొక్క ఆధ్యాత్మిక వీరత్వంను, అంతర్గత సామర్థ్యముల అద్భుతములను ప్రదర్శించాలని అతడు నాకు ఆసక్తిని కల్గించెను. ఈ మైదానంలో పోరాడుటకు నేనెప్పుడు అర్హుడినవుతాను?. ఇది కేవలం అల్లాహ్ తాలా అనుగ్రహం మరియు అతని అనంత కటాక్షంతో నాలాంటి ఒక ధీనుడి ద్వారా తన ధర్మము యొక్క గౌరవం బయటపడాలని అతడు ఆశించెను. ఇస్లాంపై మన వ్యతిరేకులు చేస్తున్న ఆరోపణలను, దాడులను నేను ఒక సమయమున లెక్క చేయగా, నా అంచన మేరకు అవి సుమారు 3000 వరకు గలవని తెలిసింది. ప్రస్తుతానికి వాటి సంఖ్య నేడు ఇంకా పెరిగి ఉండవచ్చును. మూడు వేల ఆరోపణలు ఎదుర్కొనేంత బలహీనమైన అంశాలపై ఇస్లాం స్థాపించబడిందని ఎవరు ఊహించుకో కూడదు. ఈ ఆరోపణలు వాస్తవం కాదు. ఈ ఆరోపణలన్నియు కేవలం వారి మందబుద్ధి, అవివేకం వలనే ఆరోపణలుగా కనిపిస్తున్నాయి. కాని నేను మీకు తెల్పు సత్యమేమనగా, నేను ఈ ఆరోపణలు లెక్కించిన సమయంలో వీటి వాస్తవికతను గూర్చి పరిశీలించగా ఇందులో ఇస్లాం యొక్క అద్భుత నిదర్శనములు గలవని, వారి అంధవిశ్వాసం వలన వారికి కనిపించడం లేవని గ్రహించాను. వాస్తవానికి ఇందులో దేవుని ఎంతో విజ్ఞత ప్రదర్శితమవుతుంది. ఎక్కడైతే అంధవిశ్వాసులు ఆరోపణలు చేయుచున్నారో అక్కడే వాస్తవాలు, సత్యాలతో కూడిన ఒక ఖజానయే దాగి యున్నది.

(మల్ఫూజాత్ సంపుటి 1, పుట 49-50)

### 125వ వార్షిక బహిరంగ సభ, ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ 125వ జల్సా సాలాన ఖాదియాన్ కొరకు 27, 28, 29, డిసెంబర్ 2019 ( శుక్ర, శని, ఆది వారాలు) తేదీలను నిర్ధారించిరి, కావునా జమాఅత్ సోదరులు నేటి నుండే ప్రార్థనలు చేయుచు ఈ శుభకరమైన జల్సాలో పాల్గొనుటకు ప్రయత్నించవలెను. అల్లాహ్ తాలా మనందరికి ఈ ధార్మిక సమావేశము నుండి లాభము ఘడించుటకు భాగ్యము కల్గించు గాకా! ఈ జల్సా అన్ని విధాల సాఫల్యము పొందుటకు, సజ్జనులు మార్గదర్శనము పొందుటకు ప్రార్థనలు చేయగలరు. జజాకుముల్లాహ్. ( నాజిర్ ఇస్లాహ్ వ ఇర్షాద్, ఖాదియాన్)


జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి ఆఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**సంపాదకీయం:-** సయ్యద్నా అమీరుల్ మునిమీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 27 మార్చి 2015 తేదీన మస్జిద్ బైతుఫుతుహ్ లో ప్రసంగించిన ఖుత్బా జుమా.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం తన అవతరణ ఉద్దేశ ఐదు విభాగాలను ప్రస్తావించిరి. వాటిలో ఒక విభాగము కరపత్రముల ప్రచురణ. అనగా ప్రచారము, నిదర్శనమును పూర్తి చేయుటకు కరపత్రముల ప్రచురణ. ఒక చోట వారిట్లనిరి.

"నిదర్శనమును పూర్తి చేయుటకు వ్యితిరేకులు, తిరస్కృతుల ఆహ్వానములో నేడు నేను 40 కరపత్రములును ప్రచురించదలచితిని. తద్వారా నేను ఏ కార్యమునకై పంపబడినానో దానిని పూర్తి చేసినానని ఏకేశ్వరుడైన అల్లాహ్ ఆస్థానములో ప్రళయ దినమున చెప్పగలను". (అర్బయీన్ నం.1 – రూహానీ ఖజాయిన్ సంపుటి 17 పుట 343)

ఈ కొద్ది కరపత్రములే కాక లేక ఒక్క సారి మాత్రమే కాక గమనించినచో వారు తమ ప్రకటన కంటే ముందు నుండి మృతి చెందే వరకు అనన్య కరపత్రములు వారు ప్రచురించిరి. ఇవన్ని ధార్మిక ప్రపంచ ఒక నిధి. ముస్లిములు, క్రైస్తవులు, ఇతర మతస్తులను కూడ వినాశనము కాకుండా రక్షించవలెనని వారిలో ఒక చింత యుండెను. వారు ఒంటరిగానే ఈ పని చేసేవారు. ఇందుకు వారెంతో కష్టపడేవారు. వారి పెద్ద పెద్ద రచనలు కూడ యున్నవి. మానవ జాతి పట్ల ప్రేమానురాగ వ్యాకులత, ప్రపంచ సవరణ బాధ వారి చిన్న కరపత్రముల ద్వారా కూడ బహిర్గతమగును. ప్రపంచ సవరణ అను ఈ బాధను కొనసాగించుట వారి జమాఅత్ సభ్యుల కర్తవ్యము కూడ. కనుక ఇటువైపు కూడ శ్రద్ధ వహించవలెను.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఈ బాధ, ఇందుకు వారి అసాధారణ కష్టము గురించి హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఒక చోట ఇట్లు తెలిపిరి.

"హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఉదాహరణ మన ముందున్నది. అనారోగ్యముతో నున్నను దివారాత్రులు కష్టపడేవారు. కరపత్రము తర్వాత కరపత్రము ప్రచురించేవారు. వారి పనిని చూచి ప్రజలు ఆశ్చర్యపడేవారు. ఒక కరపత్రము ఇచ్చిన తర్వాత దాని ప్రభవాము అనగా ఆ కరపత్రము వలన ఏర్పడిన వ్యతిరేకత చల్లారక ముందే మరొక కరపత్రము ప్రచురించేవారు. ఈ సందర్భమున కరపత్రము జారీ చేయుట వలన ప్రజలలో దురభిప్రాయము ఏర్పడునని సభ్యులు అభిప్రాయపడేవారు. కాని వారు ఖాతరు చేయకుండా లోహమును వేడిలోనే మరల్చవచ్చునని అనేవారు. ఉత్సాహములో ఏ మాత్రం చల్లదనము వచ్చినా వెంటనే మరో కరపత్రము ప్రచురించేవారు. తద్వారా మరల వ్యతిరేక ఉత్సాహము ఉప్పొంగేది. వారు రాత్రింబవళ్లు ఇలాగే పని చేసిరి. ఇదే సఫలమునకు కారణము. ఈ కారణమును మనము అవలంభించినచో సఫలము కావచ్చును. వ్యతిరేకత తగ్గవలెనని ఆలోచించకూడదు". (అల్‌ఫజల్ దినపత్రిక ఖాదియాన్ దివి:9 నవంబర్ 1943 పుట 2 సంపుటి 31 నం.263)

వ్యతిరేకత ఎదురగుచుండగానే కరపత్రము కూడ ప్రచురించవలెను. అప్పుడే ప్రభావము ఏర్పడును.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కాలమునే హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ ప్రస్తావించుచు ఇట్లనిరి. "హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కాలములో ప్రచారము కరపత్రముల ద్వారా జరిగేది. ఆ కరపత్రములు రెండు, నాలుగు పుటలలో యుండెడివి. వాటి వలన దేశములో విప్లవము ఏర్పడేది. అధికముగా వాటిని ప్రచురించేవారు. ఆ కాలములో అధికమనగా ఒకటి రెండు వేల సంఖ్యని భావించేవారు. కొన్ని సార్లు పది పది వేల సంఖ్యలో కూడ కరపత్రములు ప్రచురించబడేవి. కానిప్పుడు మన జమాఅత్ ఇరవై రెట్లు అధికముగా గలదు. ఇప్పుడు కరపత్రముల ప్రచారమనగా యాభై యాభై వేలు లేదా లక్ష లక్ష పంఖ్యలో కరపత్రములు ప్రచురించవలెను. అప్పుడు కరపత్రములు ఎలా మన వైపు ప్రజలను ఆకర్షించునో చూడుము. గతములో కరపత్రములు 12 సార్లు ప్రచురించబడినచో ఇప్పుడు సంవత్సరములో రెండు మూడు సార్లు చేసినను రెండు లేదా నాలుగు పుటలకు పరిమితం చేసినను అవి ఒక్కొక్క లక్ష లేదా రెండు రెండు లక్షల సంఖ్యలో ప్రచురితమైనచో అవి ఏ విధముగా విప్లవము సృష్టించునో తెలియును".

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 33 పుట 5,6 అల్‌ఫజల్ 11 జనవరి 1952)

మూడు, నాలుగు సంవత్సరముల క్రితము ఒకటి రెండు పుటలతో కూడిన కరపత్రములు సిద్ధము చేసి ప్రచారము చేయవలెనని నేను జమాఅతులకు సూచించితిని. లక్షల సంఖ్యలో చేయవలెనని ఇందుకు టార్గెట్ కూడ విధించి యుంటిని. తద్వారా ఇస్లాం అందమైన బోధన కూడ ప్రపంచమునకు తెలియును. ఇస్లాం వాస్తవికత ప్రపంచమునకు తెలియవలెను. ఈ కాలములో అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాంను పంపి ఇస్లాం పునరుజ్జీమునకు సంకల్పించి, నిజమైన బోధనను జారీ చేసినాడని ప్రపంచమునకు సందేశము అందవలెను. తన దాసులను షైతాన్ నుండి రక్షించుటకు ఇప్పటికి అల్లాహ్ తాలా తన అవతారులను పంపునని ప్రపంచమునకు తెలియవలెను. ఈ విధముగా పని చేసిన జమాఅతులలో చాలా మట్టుకు అల్లాహ్ తాలా కృపానుసారము గొప్ప అనుకూల ఫలితములు వెలువడినవి. స్పేన్‌లో జామిఆ విద్యార్థులను నేను పంపియుంటిని. వారక్కడ చాలా పని చేసినారు. సుమారు మూడు లక్షల వరకు వివిధ కరపత్రములు పంచి పెట్టిరి. ఇదే విధముగా ఇప్పుడు జామిఆ కెనడా విద్యార్థులు స్పేనిష్ దేశములలో, మెక్సికోకు వెళ్లి ఈ కరపత్రములను పంచి పెట్టిరి. అల్లాహ్ కృపానుసారము దీని వలన ప్రచార మైదానములో విశాల మార్గములు తెరుచుకొన్నవి. బైఅత్‌లు కూడ అయినవి.

కనుక ఇందు కొరకు ఒక కరపత్రము తర్వాత మరొకటి ప్రచురించవలెను. పెద్ద పెద్ద పుస్తకములు పంచి పెట్టే బదులు వీటిని పంచిపెట్టవలెను.

కరపత్రముల ప్రచురణ ఏ విధముగా యుండవలెనో తమ అభిప్రాయమును తెలుపుచు ఒక చోట మాట వరుసలో హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. తాము స్వయముగా కరపత్రములు ప్రచురించుతామని కొందరు కోరెదరు. ఆ కాలములో కూడ కోరేవారు. ఇప్పుడు అంత సంఖ్యలో చేయకున్నను కొందరైనా తమ వైపున ప్రచురించవలెనని కోరుదురు. దీని గురించి హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి.

"ఈ కరపత్రములను కేంద్రము నుండి ప్రచురించి, వాటిని పంచిపెట్టివలెను. వాటి ప్రచురణను పెంచవలెను. స్వంతముగా కరపత్రములను ముద్రించడంతో నా పేరు కూడ రావలెనని స్వయం ప్రసన్నత కలుగును. ఇది ఎంత ఘోర వ్యాధి అనగా దీని గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాతు వస్సలాం ఒక సంఘటనను ప్రస్తావించేవారు. (అనగా కొందరికి స్వయం ప్రసన్నత లేదా తమ అభిప్రాయమును వ్యక్తపరచుట, తన ప్రొజెక్షన్ (projection)ను కొందరు కోరుదురు. దీని గురించి హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒక సంఘటనను ప్రస్తావించేవారు. ఒక స్త్రీ యుండెను. ఆమె ఒక ఉంగురము చేయించుకొనెను. కాని ఒక్క మహిళ కూడ దానిని పొగడలేదు. ఒక రోజు ఆమె తన ఇంటికి నిప్పు పెట్టెను. ప్రజలు గుమికూడినప్పుడు ఈ ఒక్క ఉంగురము తప్ప ఏమి మిగల లేదని అనెను. దీనిని ఎప్పుడు చేయించితివని ఒకరు ప్రశ్నించెను. ఈ ప్రశ్న ఇంతకు ముందు ఎవరైనా అగిడియుంటే నా ఇల్లు కాలిపోయేది కాదని ఆ స్త్రీ అనెను. వాస్తవానికి పేరు ప్రతిష్టలు పొందు కోరిక ఎటువంటిదనగా అది ఎవరికి తగులునో అతన్ని కాల్చి బూడిద చేయును. కాని ఆ వ్యక్తికి తెలియనే తెలియదు".(అహెమ్ ఔర్ జరూరి ఉమూర్, అన్వారుల్ ఉలూమ్ సంపుటి 13 పుట 340)

ఇది కరపత్రము వరకు పరిమితం కాదు. ఇతర విషయములలో కూడ స్వయం ప్రసన్నత, పేరు ప్రతిష్టల విషయము మెదడులో కలిగినప్పుడు మానవుడు దానికి కృషి చేసినచో దానితో ఎలాంటి లాభము కలుగక నష్టములు అధికమగును. ఇప్పుడు ప్రచార మైదానములో అల్లాహ్ తాలా కృపానుసారము ఎంత విశాలత ఏర్పడినదనగా ఎవరైనా వ్యక్తిగతంగా కరపత్రము ప్రచురించినా అది చాలా తక్కువే అగును. కాని తమ పరిధిలోనే స్వయం ప్రసన్నత కొద్ది గొప్ప బహిర్గతమగును. కాని సదుద్దేశముతో చేయబడినచో, అందరు కేవలం స్వయం ప్రసన్నత కొరకు చేయుచున్నారని కాదు. (9వ పేజిలో చదువుము)

# జుమా ప్రసంగము

హిజ్రి 6వ సం॥ రబీవుస్సాని మాసంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ స్వతంత్ర బానిస మరియు దత్తపుత్రుడైన హజ్రత్ జైద్ బిన్ హార్స(రజి) నాయకత్వంలో కొందరు ముస్లిములను బనూ సులైమ్ తెగవైపునకు పంపిరి. ఈ తెగ అప్పుడు నజద్ ప్రాంతములో జమూమ్ అనే చోట నివాసముండేది. కొంత కాలము నుండి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విరుద్ధంగా వీరు కుట్రలు పన్నుచుండిరి. పన్నాగాలు చేస్తుండేవారు, యుద్ధాలు చేయాలని ప్రయత్నించేవారు. ఖందఖ్ యుద్ధంలో కూడ ఈ తెగవారు ముసల్మానులకు వ్యతిరేకముగా చాలా గట్టి పోరాటం చేశారు.

హిజ్రి 8వ సం॥లోని మౌతా అను యుద్ధం జరిగింది. మౌతా సిరియా దేశానికి ప్రక్కనే ఉన్నటు వంటి ఒక ప్రాంతము. ఈ యుద్ధం యొక్క కారణాలను తెల్పుచూ, వివరిస్తూ అల్లామా ఇబ్నే సఅద్ ఇలా తెల్పిరి. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హారిస్ బిన్ ఉమైర్ (రజి) రాయబారిగా నియమిస్తూ ఒక ఉత్తరంను బాగ్దాద్ రాజుకు పంపిరి. వీరు మౌతా ప్రాంతానికి చేరుకోగా అక్కడ షురహ్‌బిల్ బిన్ అమ్రూ ఘస్సాని వారి(రజి)ని హతమార్చి అమరుడిని చేసిరి.

హజ్రత్ జైద్ (రజి) కుమారుడైన హజ్రత్ ఉసామా(రజి) ఇలా తెల్పిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అనగా హజ్రత్ ఉసామా(రజి)ను మరియు హజ్రత్‌హసన్ (రజి)ను ఎత్తుకొని ఓ అల్లాహ్ నీవు ఈ ఇరువురిని ప్రేమించుము. ఎందుకనగా నేను ఈ ఇరువురిని ప్రేమిస్తున్నాను అని దుఆ చేసేవారు.

12 రబీవుల్ అవ్వల్ తేదీన హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సాయంత్రం వేళ పరమపదించిరి. కావున ముస్లిముల సైన్యము జుర్ఫ్ ప్రాంతము నుండి తిరిగి మదీనాకు చేరుకొనెను. హజ్రత్ ఉసామా పతాకమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తలుపునకు హజ్రత్ బురైదహ్(రజి) కట్టివేసిరి.

మన నాయకుడు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్‌నకు ప్రియులైన, ఆప్తులైన హజ్రత్ జైద్ బిన్ హార్స, వారి కుమారుడు హజ్రత్ ఉసామా బిన్ జైద్‌పై అల్లాహ్ తఆలా వేలాది కరుణలు, శుభములను కురిపించుగాక!.

సయ్యద్నా అమీరుల్ ముమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ. 28 జూన్ 2019 ( 28 ఎహ్సాన్ 1398 హి.ష) తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ లండన్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా.

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِينَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّينِ ۔

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِينُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ۔

صِرَاطَ الَّذِينَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّينَ ۔

హజ్రత్ జైద్ బిన్ హార్స గురించి మిగిలిన మరికొన్ని సంఘటనలు, విషయములను నేడు నేను ప్రస్తావింతును. హిజ్రి 6వ సం॥ రబీవుల్ ఆఖర్ నెలలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హార్స నాయకత్వములో కొందరు ముస్లిములను బనూ సులైమ్ తెగ వైపునకు పంపిరి. ఈ విషయమును తెల్పుచూ సీరత్ ఖాతమున్నబియ్యీన్‌లో హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిట్లు వ్రాసిరి.

హిజ్రి 6వ సం॥ రబీవుస్సాని మాసంలో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ స్వతంత్ర బానిస మరియు దత్తపుత్రుడైన హజ్రత్ జైద్ బిన్ హార్స(రజి) నాయకత్వంలో కొందరు ముస్లిములను బనూ సులైమ్ తెగవైపునకు పంపిరి. ఈ తెగ అప్పుడు నజద్ ప్రాంతములో జమూమ్ అనే చోట నివాసముండేది. కొంత కాలము నుండి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు విరుద్ధంగా వీరు కుట్రలు పన్నుచుండిరి. పన్నాగాలు చేస్తుండేవారు, యుద్ధాలు చేయాలని ప్రయత్నించేవారు. ఖందఖ్ యుద్ధంలో కూడ ఈ తెగవారు ముసల్మానులకు వ్యతిరేకముగా చాలా గట్టి పోరాటం చేశారు. జైద్ బిన్ హార్స(రజి) మరియు వారి మిత్రులు మదీనా నుండి 50 మైళ్ళ దూరంలో ఉన్నటువంటి ఈ జమూమ్ ప్రాంతానికి చేరుకోగా అక్కడ ఎవరు లేకుండిరి. అక్కడ ఖాళీ ప్రదేశం గలదు. కాని ముస్లిములకు శత్రువైన ముజైన తెగకు చెందిన హలీమా అనే పేరుగల ఒక మహిళ బనూ సులైమ్ తెగవారు తమ జంతువులను, జీవరాశులను మేపుకుంటున్న మైదానాల ఆచూకిని గూర్చి జైద్ బిన్ హార్సకు తెలిపింది. ఆ సమాచారంను అదృష్టముగా భావించిన హజ్రత్ జైద్(రజి) వారిపై ఒక్కసారిగా దాడి చేయగా, ఈ ఊహించని పరిణామాన్ని చూసి వారందరు భయాందోళనతో నలువైపులకు చెల్లా చెదురైనారు. అలా పట్టుబడిన కొందరు వ్యక్తులను, కొన్ని జంతువులను తీసుకొని ముసల్మానులు మదీనాకు చేరుకున్నారు. దైవికముగా ఆ ఖైదీలలో హలీమ భర్తకూడ ఉండెను. వాస్తవానికి వారు యుద్ధంలో వ్యతిరేకముగా పోరాడినను హలీమా చేసిన సహాయం వలన ఎలాంటి ఫిదియా లేకుండానే అతనిని విడిచిపెట్టడం జరిగింది. కేవలం విడిచిపెట్టడమే కాకుండా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి ఉపకారం చేస్తూ పంపించడం జరిగింది. అలా హలీమా మరియు ఆమే భర్త ఇరువురు సంతోషంతో తిరిగి వారి ప్రాంతానికి వెళ్ళిపోయిరి.

(సీరత్ ఖాతమున్నబీయ్యీన్ పుట 669)

హిజ్రి 6వ సంవత్సరము జమాదివుల్ అవ్వల్ మాసంలో అయిస్ ప్రాంతములో జరిగిన మరొక యుద్ధంనకు కూడ హజ్రత్ జైద్ బిన్ హార్సను పంపించడం జరిగింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) సీరత్ ఖాతమున్నబీయ్యీన్‌లో ఈ విధముగా పేర్కొన్నారు.

బనూ సులైమ్ వర్గంతో జరిగిన సమరం నుండి జైద్ బిన్ హార్స తిరిగి వచ్చిన కొద్ది రోజులకే ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జమాదియుల్ ఊలా నెలలో వారిని 70 మంది అనుచరులకు నాయకునిగా నియమించి మదీనా నుండి మరల పంపించిరి. చరిత్రకారులు ఈ సమరం నకు కారణము ఇట్లు తెలిపిరి. సీరియా నుండి మక్కా ఖురైష్‌ల ఒక బృందము వచ్చుచుండెను. దానిని నిలువరించుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ సైన్యమును పంపిరి.

ఇక్కడ వివరించవలసిన ముఖ్య విషయమేమనగా ఖురైష్ తెగలు ఎల్లప్పుడు ఆయుధములు ధరించి వుండేవారు. మక్కా నుండి సీరియాకు రాకపోకలు సాగించేటప్పుడు మదీనాకు సమీపము నుండి వెళ్లేవారు. తద్వారా వీరు ఎప్పుడైనా మదీనాపై దాడి చేయవచ్చుననే భయము ఉండేది. ఇంతే కాక ఈ బృందములు మార్గమధ్యలోని తెగలను ముస్లిములకు వ్యతిరేకంగా ప్రేరేపించేవారు. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) మరల ఇలా వ్రాసారు. వారి ప్రేరణవలన దేశమంతటా ముస్లిములకు విరుద్ధంగా శత్రుత్వమనే ప్రమాదకర అగ్ని ఎగిసిపడుతుండెను. కావున వారిని నిలువరించవలసిన అవసరముండెను. మొత్తానికి ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ బృందము గురించి తెలియగానే జైద్ బిన్ హార్సను పంపిరి. వారు ఎంతో తెలివితో ఎవరికి తెలియకుండా రహస్యముగా ముందుకు వెళ్లి ఈస్ అనే ప్రాంతములో ఆ బృందమును పట్టుకొనిరి. ఈస్ అనే ప్రాంతము మదీనా నుండి నాలుగు రోజుల ప్రయాణ దూరములో సముద్రము వైపుండెను. ఈ ఆకస్మిక దాడి వలన ఆ బృందము వారు ముస్లిముల దాడిని తట్టుకోలేకపోయిరి. కావున వారు తమ సామాగ్రి అక్కడే

వదిలి పారిపోయిరి. జైద్ కొందరు ఖైదీలను బంధించి సామాగ్రిని వశపరచుకొని తిరిగి మదీనాకు చేరుకొని, ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద హాజరైరి.

(సీరత్ ఖాతమున్నబీయ్యాన్ పుట 670)

ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరో ముఖ్యమైన విషయమేమనగా, ఈ బృంధాలు ముసల్మానులకు వ్యతిరేకముగా ఏదోఒక ప్రణాళిక రచించుటకు లేదా ముసల్మానులపై అకస్మిక దాడి చేయుటకు పథకాలు రూపొందించుటకు ప్రయత్నిస్తున్నారనే సమాచారం తెలిసినప్పుడే ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా యుద్ధాలకు గాని లేదా బృందాలను అడ్డుకోవడానికి గాని పంపేవారు. కావున ఈ క్రమములోనే మరల హజ్రత్ జైద్(రజి)ను హిజ్రి 6వ సంవత్సరము, జమాదివుస్సానిలో తరఫ్ ప్రాంతమువైపు పంపడం జరిగింది. ఈ విషయమును గూర్చి హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఇలా వ్రాసినారు.

ఘజ్వా బనూలైహాన్ జరిగిన కొన్ని రోజులకు అనగా హిజ్రి 6వ సంవత్సరము జమాదివుస్సాని మాసంలో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హార్స నాయకత్వములో పదిహేను వందల అనుచరుల ఒక బృందమును తరఫ్ వైపునకు పంపిరి. ఈ ప్రాంతము మదీనా నుండి 36 మైళ్ల దూరములో యుండెను. ఆ కాలములో అక్కడ బనూ సాలబ తెగస్తులు నివాసముండేవారు. కాని జైద్ బిన్ హార్స అక్కడికి చేరుకునే లోపు వారికి ఈ సమాచారము తగిన సమయములో అందినందున వారు అక్కడి నుండి పారిపోయిరి. ఫలితముగా హజ్రత్ జైద్ (రజి) మరియు వారి మిత్రులు కొన్ని రోజుల వరకు ఆ ప్రాంతములోనే ఉండి ఆ తరువాత మదీనాకు తిరిగి వచ్చిరి. (సీరత్ ఖాతమున్నబీయ్యాన్ పుట 680-681)

అక్కడ వారు ఎలాంటి యుద్ధం చేయలేదు, వారు ఎక్కడికి పారిపోయారు అని అచూకి కూడ వెతకలేదు.

మరల అదే మాసంలో జైద్ బిన్ హార్స(రజి)ను హిస్మఅనే ప్రాంతమునకు పంపిన మరొక విషయము కూడ గలదు. ఈ విషయమును గూర్చి హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఇలా వ్రాసినారు.

హిజ్రి 6వ సం॥లో జమాదియుల్ ఆఖర్ నెలలో జైద్ బిన్ హార్సను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం 500 ముస్లిములతో హిస్మ ప్రాంతమునకు పంపిరి. ఇది మదీనాకు ఉత్తరాన బనూ జుజామ్ నివాసమై యుండెను. ఈ సమరమునకు ఉద్ధేశమేమనగా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక అనుచరులు దహ్యా కల్బీ ఖైసరె రోమ్‌తో భేటి అయిన తర్వాత సీరియా నుండి తిరిగి వచ్చుచుండిరి. వారి వద్ద భేటి వలన ఖైసర్ ఇచ్చిన బహుమానాలతో పాటు కొంత వ్యాపార సామాగ్రికూడ ఉండెను. వారు బనూ జుజామ్ ప్రాంతము నుండి వెళ్లుచుండగా ఆ తెగ నాయకుడు హునేద్ బిన్ ఆరిజ్ తమ తెగలోని కొందరు వ్యక్తులను తీసుకొని దహ్యాపై దాడి చేసి ఖైసర్ ఇచ్చిన సామాగ్రి, వ్యాపార వస్తువులన్నిటిని దోచుకొనెను. వారు ఎంతగా దోచుకున్నారనగా దహ్యా ఒంటిపై ఉన్న చిరిగిపోయిన దుస్తువులు తప్ప మరేమి కూడ లేకుండెను. ఈ దాడిని గూర్చిన విషయమును గూర్చి బనూ జుజామ్ తెగలోని ఒక వర్గమైన బనూ జుబైబ్‌కు తెలియగా వారు ముస్లిములైనందున వెంటనే వారు బనూ జుజామ్ వారిని వెంబడించి వారితో పోరాడి వారు దోచుకున్న సామాగ్రిని తిరిగి దహ్యాకు అప్పగించి, మదీనాకు పంపిరి. దహ్యా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుడైనందున దహ్యా మదీనా చేరుకొని ఈ పరిస్థితులన్నిటిని ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియజేసెను. ఇందుకు బదులుగా జైద్ బిన్ హార్సను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం పంపిరి. జైద్ వెంట దహ్యాను సైతం పంపిరి. జైద్ బృందము ఎంతో చాకచక్యంగా అన్ని జాగ్రత్తలు పాటించుచు పగలు దాక్కుంటూ రాత్రివేళ ప్రయాణము చేస్తూ హిస్మ ప్రాంతమునకు చేరుకొని ఉదయాన్నే బనూ జుజామ్ ప్రజల వద్దకు చేరుకొనిరి. బనూ జుజామ్ ఎదురు దాడికి దిగిరి. యుద్ధ తరహాలో పోరాటం జరిగినది. కాని ముస్లిముల ఆకస్మిక దాడిని వారు ఎదుర్కోలేక కొద్ది సమయములోనే అక్కడి నుండి పారిపోయిరి. ముస్లిములకు విజయము లభించెను. జైద్ బిన్ హార్స చాలా సామాగ్రి, పశువులు, సుమారు వంద మందిని ఖైదీలుగా బంధించి తీసుకొని తిరిగి వచ్చిరి. జైద్ (రజి) మదీనాకు చేరడానికి ముందే బనూ జుజామ్ తెగకు చెందిన బనూ జుబైబ్ ప్రజలకు ఈ యుద్ధం గురించి తెలిసింది. వెంటనే వారు వారి నాయకుడైన రిఫాఅ బిన్ జైద్ ఆధ్వర్యములో ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని ఓ రసూలుల్లాహ్! సల్లల్లాహు అలైహి వసల్లం మేము ఇస్లాంను స్వీకరించాము. నేను ముందుగా తెల్పినట్లు వారు సామాగ్రిని విడిపించారు. మిగిలిన మా తెగవారికి శాంతి భద్రలు కల్పించుటకు ఒప్పందాలు కూడ జరిగాయి. అలాంటప్పుడు ఈ యుద్ధంలో మా తెగవారిపై ఎందుకు దాడి చేశారు?. అనుకోకుండా ఆ యుద్ధంలో వీరి తెగవారిలో కొందరిపై దాడి చేయడం జరిగింది. అందుకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మీరు సరిగ్గానే చెప్పారు. కాని ఈ విషయం బహశా జైద్‌కు తెలియకపోవచ్చును అని సమాధానమిచ్చి, ఆ యుద్ధంలో వీరి తెగవారిలో మరణించిన వారిపట్ల హుజూర్ (స) ప్రగాఢ సానుభూతిని తెల్పిరి. అందుకు రిఫాఅతో వచ్చినటు వంటి అబూ జైద్ హుజూర్ (స) ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! ఒప్పందం చేసుకున్న వారిపై దాడి జరిగింది. ఇది పొరపాటున జరిగిన సంఘటన కావున మరణించిన వారి పట్ల మేము ఎలాంటి పరిహారంను ఆశించడం లేదు. కాని మా తెగ వారిలో ప్రాణాలతో పట్టుబడిన వారిని మరియు వారు స్వాధీనం చేసుకున్న సామాగ్రిని తిరిగి మాకు ఇప్పించండి అని విన్నవించుకొనిరి. అందుకు హుజూర్ (స) ఇది సమంజసమైన విషయం అని సమ్మతం తెల్పుచూ వెంటనే హజ్రత్ అలీ (రజి) ను పిలిపించి తమ ఖడ్గమును గుర్తుగా వారికి అందిస్తూ ఈ తెగవారి ఖైదీలను, వారి సామాగ్రిని వెంటనే వారికి అప్పగించండి అని జైద్‌కు వర్తమానం పంపిరి. ఆదేశం అందడంతో హజ్రత్ జైద్ (రజి) వెంటనే వారి ఖైదీలను విడిచిపెట్టి, వారి సామాగ్రిని వారికి అప్పగించిరి. ఆపై వారి యుద్ధ సంపదను కూడ వారికి ఇచ్చివేసిరి.

(సీరత్ ఖాతమున్నబీయ్యాన్ పుట 681-682)

ఇది ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒప్పంద నియమావళి. పట్టుబడినంత మాత్రమున వారిపై దౌర్జన్యం చేయాలని చూడలేదు. వారు పొరపాటున ఆ యుద్ధంలో పాల్గొన్నారో లేదా కావాలనే కొందరు ముసల్మానులకు వ్యతిరేకముగా యుద్ధం చేశారో తెలియకున్నను పొరపాటున అలా జరిగిందని తెల్పినందున పట్టుబడిన వారందరిని విడిచిపెట్టమని ఆదేశించడం జరిగింది. ఆపై వారి సామాగ్రిని కూడ వారికి అప్పగించడం జరిగింది.

మరల హజ్రత్ జైద్ (రజి) హిజ్రి 6వ సంవత్సరము రజబ్ మాసంలో వాదియుల్ ఖుర్ఆ వైపుకు పంపబడినట్లు మనకు తెలుస్తుంది. హిస్మ సమరము తరువాత నెల రోజులకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరల జైద్ బిన్ హార్సను వాదియుల్ ఖురా వైపునకు పంపిరి. జైద్(రజి) సైన్యం వాదియుల్ ఖుర్ఆ ప్రాంతానికి చేరుకొనగా బనూ ఫరాజ తెగవారు ముసల్మానులను ఎంతో బలంగా ఎదుర్కొనిరి. ఫలితముగా ఈ యుద్ధములో చాలా మంది ముస్లిములు అమరులైరి. స్వయముగా జైద్‌నకు కూడ తీవ్ర గాయాలైనవి. కాని అల్లాహ్ తఆలా కృపానుసారము వారు కాపాడబడిరి. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఈ విధముగా తెల్పిరి. వాదియుల్ ఖుర్ఆ అను ప్రాంతము మదీనా నుండి ఉత్తర దిక్కున గల సిరియావైపు గల మార్గములో ఉన్నటువంటి ఒక జనావాస లోయప్రాంతయాి లోయలోనే అనేక నగరాలు, గ్రామాలు ఉండేవి. అందుకే ఈ లోయప్రాంతానికి వాదియుల్ ఖుర్ఆ అని పేరు వచ్చింది. అనగా నగరాలు ఉన్నటువంటి లోతట్టు ప్రాంతము. (సీతర్ ఖాతమున్నబీయ్యాన్ పుట 682-683)

హిజ్రి 8వ సం॥లోని మౌతా అను యుద్ధం జరిగింది. మౌతా సిరియా దేశానికి ప్రక్కనే ఉన్నటు వంటి ఒక ప్రాంతము. ఈ యుద్ధం యొక్క కారణాలను తెల్పుచూ, వివరిస్తూ అల్లామా ఇబ్నే సఅద్ ఇలా తెల్పిరి. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం హారిస్ బిన్ ఉమైర్ (రజి) రాయబారిగా నియమిస్తూ ఒక ఉత్తరంను బాగ్దాద్ రాజుకు పంపిరి. వీరు మౌతా ప్రాంతానికి చేరుకోగా అక్కడ షురహ్‌బిల్ బిన్ అమ్రూ ఘస్సాని వారి(రజి)ని హతమార్చి అమరుడిని చేసిరి. ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి రాయబారులలో హజ్రత్ హారిస్ బిన్ ఉమైర్ (రజి) కాకుండా మరెవరు కూడ హతమార్చబడలేదు. మొత్తానికి ఈ చర్య ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు చాలా బాధ కల్గించింది. ఆం హజ్రత్ సల్లల్లాహు వెంటనే అనుచరులను పిలిపించగా వారు మూడు వేల మంది

జుర్ఫ్ అనే ప్రాంతములో ఏకమైయ్యారు. అప్పుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వారితో మీఅందరికి హజ్రత్ జైద్ బిన్ హార్స నాయకత్వము వహించునని తెల్పుచూ హజ్రత్ జైద్(రజి)కు ఒక తెల్లని జెండాను అప్పగిస్తూ ఇట్లు హితబోధ చేసిరి. "హారస్ బిన్ ఉమైర్ అమరులైన ప్రాంతానికి మీరు చేరుకొని అక్కడి వారికి ఇస్లాం సందేశమును అందించుము. ఒకవేళ వారు స్వీకరించినచో మంచిది. లేనిచో వారికి వ్యతిరేకముగా అల్లాహ్‌ను సహాయమడుగుము. వారితో యుద్ధం చేయుము." ఈ మౌతా యుద్ధము హిజ్రి 8వ సంవత్సరము జమాదియుల్ అవ్వల్ నెలలో సంభవించినది.

(అత్తబుకాతుల్ కుబ్రా సంపుటి 2, పుట 97–98)

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి) ఇట్లు ఉల్లేఖించిరి. మౌతా యుద్ధమునకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జైద్ బిన్ హార్సను నాయకునిగా నియమించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. జైద్ అమరులైనచో జాఫర్ అమీర్‌గా యుందురు. జాఫర్ కూడ అమరులైనచో అబ్దుల్లాహ్ బిన్ రవాహ మీకు నాయకులగుదురు. ఈ సైన్యానికి జైషుల్ ఉమ్రా అని కూడ నామకరణం గలదు. (సహి బుఖారి కితాబుల్ మఘాజి, బాబ్ ఘజ్వా మౌతా మిన్ అర్జే షామ్ హదీస్ 4261)

సహి బుఖారి మరియు మస్నద్ అహ్మద్ బిన్ హంబల్‌లో ప్రస్తావవించబడిన ఉల్లేఖనమేమనగా, హజ్రత్ జాఫర్ (రజి) ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం సన్నిధికి చేరుకొని ఇలా విన్నవించుకొనిరి. ఓ రసూలుల్లాహ్! నాపై జైద్‌ను నాయకుడిగా నియమిస్తారని నేను ఎన్నడు ఆలోచించలేదు. అందుకు హుజూర్ (స) వారితో ఏది శ్రేయస్కరమో నీకు తెలియదు కావున ఈ విషయమును ఇక్కడే వదిలివేయుమని తెల్పిరి.

(అత్తబుకాతుల్ కుబ్రా లి ఇబ్నే సఅద్, సంపుటి 3, పుట 34)

ఈ యుద్ధమును గూర్చి నేను కొన్ని జుమాల క్రితము లేదా కొన్ని నెలల క్రితము కొంత వరకు మీకు తెలియపర్చాను. మొత్తానికి మరల ఆ విషయమును మీ ముందు ప్రస్తావించెదను. ఎందుకనగా హజ్రత్ జైద్ (రజి) ను గూర్చి ఇక్కడ ప్రస్తావించడం జరుగుతుంది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) కూడ మౌతా యుద్ధమును గూర్చి తెల్పుచూ ఇట్లనిరి.

హజ్రత్ జైద్ బిన్ హార్స (రజి)నుఈ యుద్ధానికి నాయకునిగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నియమిస్తూ, సైనికులకు ఇట్లూ హితోపదేశం చేసిరి. " ప్రస్థుతం నేను జైద్‌ను ఈ సైన్యానికి నాయకునిగా నియమిస్తున్నాను, ఒకవేళ జైద్ ఈ యుద్ధంలో మృతిచెందినచో వారి స్థానమును జాఫర్ (రజి) తీసుకొని బాధ్యతలు చేపట్టును. ఒకవేళ వారు కూడ మృతి చెందినచో అబ్దుల్లాహ్ బిన్ రవహ్ నాయకత్వం వహించును. ఒకవేళ వారు కూడ మృతి చెందినచో ముసల్మానులు తమకు నచ్చిన వ్యక్తిని నాయకునిగా ఎన్నుకోగలరు. " ఆం హుజూర్ (స) ఈ విషయమును తెల్పుచున్నప్పుడు ఒక యూదుడు కూడ హుజూర్ (స) ప్రక్కన కూర్చొని యుండెను. అతడు హుజూర్ (స)తో ఇట్లనెను. "వాస్తవానికి నేను మిమ్ము ప్రవక్తయని విశ్వసించడం లేదు. కాని ఒకవేళ మీరు సత్యవంతులే అయినచో ఈ ముగ్గురిలో ఏ ఒక్కరు కూడ ప్రాణాలతో తిరిగి రారు. ఎందుకనగా ప్రవక్త నోటి నుండి వెలువడిన వాక్కులు సత్యమైతీరుతాయి." కొన్ని నెలల క్రితం నేను ఈ విషయమును గూర్చి ప్రస్తావించినప్పుడు ఈ విధముగా ప్రస్తావించి ఉండవచ్చును. కాని హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) ఆ విషయాన్ని ఈ విధముగా పొందుపర్చడం జరిగింది. ఆ యూదుడు హజ్రత్ జైద్ వద్దకు వచ్చి వారికిట్లు చెప్పెను. ఒకవేళ మీ ప్రవక్త నిజమైన ప్రవక్త అయినచో మీలో ఎవరు ప్రాణాలతో తిరిగి రాలేరు. హజ్రత్ జైద్ అతనితో ఇట్లనిరి. నేను ప్రాణాలతో వస్తానా? రానా? అనేది ముఖ్యము కాదు. కాని మా ఈ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నిశ్చయముగా నిజమైన ప్రవక్తయే. అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు ఈ సంఘటన పూర్తిగా అలాగే జరిగెను. హజ్రత్ జైద్ అమరులైరి. వారి తర్వాత జాఫర్ నాయకత్వము అందుకొనిరి. వారు కూడ అమరులైరి. ఆ తర్వాత హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ సైన్యాధిపతిగా నిలిచిరి. కాని వారు కూడ అమరులైరి. సైన్యము విచ్ఛిన్నం కాక ముందే ముస్లిములు సూచించగా హజ్రత్ ఖాలిద్ బిన్ వలీద్ పతాకమును తమ చేతిలో పట్టుకొనిరి. వారి ద్వారా అల్లాహ్ తఆలా ముస్లిములకు విజయము నొసంగెను. ఆ తర్వాత వారు సురక్షితంగా సైన్యానికి తీసుకవచ్చిరి.

(ఫరీజయే తబ్లీఘ్ అవుర్ అహ్మదీ ఖవాతీన్ , అన్వారుల్ ఉలూమ్ సంపుటి 18, పుట 405–406)

బుఖారిలో కూడ ఈ హదీస్ ఈ విధముగా లభిస్తుంది. హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెల్పిరి. జైద్ జెండా పట్టుకొనెను. అమరుడయ్యెను. తరువాత జాఫర్ పట్టుకొనెను అతడు కూడ అమరుడయ్యెను. ఆ తరువాత అబ్దుల్లాహ్ బిన్ రవాహ్ జెండా పట్టుకొనెను, అతడు కూడ అమరుడయ్యెను. ఈ సందేశము నిచ్చునప్పుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం కన్నుల నుండి కన్నీరు కారుచుండెను. ఆ తరువాత ఖాలిద్ బిన్ వలీద్ (రజి) నాయకత్వం లేకుండా జెండా పట్టుకొనును అల్లాహ్ తాలా అతని ద్వారా విజయమును చేకూర్చును. (సహి బుఖారి కితాబుల్ జనాయిజ్ బాబ్ అర్రజుల్ యన్అ ఇలా అహ్‌లల్ మయ్యతి బినఫ్సిహి హదీస్ 1246)

హజ్రత్ జైద్ బిన్ హార్స, హజ్రత్ జాఫర్, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ అమరులైన విషయము రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు తెలియగా వారి స్థితిని వివరించుటకు నిలబడిరి. మొదట హజ్రత్ జైద్ ప్రస్తావన ప్రారంభించిరి. వారిట్లనిరి. ఓ అల్లాహ్! జైద్‌ను క్షమించు. ఓ అల్లాహ్! జైద్‌ను క్షమించు. ఓ అల్లాహ్! జైద్‌ను క్షమించు. అనంతరం వారిట్లనిరి. ఓ అల్లాహ్! జాఫర్, అబ్దుల్లాహ్ బిన్ రవాహను క్షమించు. (అత్తబుకాతుల్ కుబ్రా సంపుటి3, పుట 34, జైదుల్ హుబ్ బిన్ హార్స, దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

హజ్రత్ ఆయిషా (రజి) ఇలా ఉల్లేఖించిరి. హజ్రత్ జైద్ బిన్ హార్స (రజి), హజ్రత్ జాఫర్ (రజి) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ రవాహ్ (రజి) అమరులైన విషయం తెలిసినప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం మస్జిద్‌లో కూర్చొని యుండిరి. వారి ముఖములో బాధ, దు:ఖము కనిపించు చుండెను. (సునన్ అబీ దావూద్, కితాబుల్ జనాయిజ్, .. హదీస్ 3122)

తబ్ఖాతుల్ కుబ్రాలో ఇలా గలదు. హజ్రత్ జైద్ అమరులైనప్పుడు వారి కుటుంబ సభ్యులను ఓదార్చుటకు నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వెళ్లిరి. వారి కుమార్తె ముఖము దుఃఖమయమై ఉండెను. ఆ దృశ్యమును చూసి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం కూడ కన్నీరు మున్నీరులైనారు. హజ్రత్ జైద్ బిన్ ఉబాదహ్ (రజి) హుజూర్ (స)తో ఓ రసూలుల్లాహ్! మీ కళ్ళ నుండి కన్నీరు రావడం ఏమిటి? అని ప్రశ్నించగా, హుజూర్ (స) హాజ షౌఖుల్ హబీబి ఇలా హబీబిహి అని సమాధానమిచ్చిరి. అనగా ఇది ఒక అభిమానుడి యొక్క అభిమానుడిపై గల అభిమానపు చిహ్నము. (అత్తబుకాతుల్ కుబ్రా సంపుటి 3, పుట 34, జైదుల్ హుబ్బి బిన్ హార్స (రజి) ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

హజ్రత్ జైద్ (రజి) మృతి చెందిన విషయమును గూర్చి తెల్పుచూ అల్లామా ఇబ్నే సాఅద్ ఇట్లు పేర్కొనిరి. మౌతా యుద్ధం కొరకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ జైద్ బిన్ హార్సను(రజి) నాయకుడిగా నియమించిరి. ఇతర నాయకులపై వీరికే ప్రాధాన్యతనిచ్చిరి. ముసల్మానులకు అవిశ్వాసులకు యుద్ధం జరుగుచున్నప్పుడు ముసల్మానుల నాయకులు నేలపై ఉండే పోరాడుచుండిరి. హజ్రత్ జైద్ (రజి) జెండా చేత పట్టుకొని విరోచితంగా పోరాడుచుండిరి. ఇతరులు కూడ వారితో పాటు విరోచితముగా పోరాడుచుండిరి. ఆ యుద్ధంలో హజ్రత్ జైద్ (రజి) బల్లెము తగలడం వలన మృతి చెందిరి. అమరులైనప్పుడు వారి వయసు 55 సంవత్సరములుండెను. హజ్రత్ జైద్ అంత్యక్రియ ప్రార్థన రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చదివించిరి. అనతరం ఇట్లనిరి. హజ్రత్ జైద్ కొరకు క్షమాపణ యాచించండి. వారు పరుగెత్తుకుంటూ స్వర్గములో ప్రవేశించిరి. (అత్తబుకాతుల్ కుబ్రా సంపుటి 3, పుట 33–34, జైదుల్ హుబ్బి బిన్ హార్స(రజి) ప్రచురణ దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)

హజ్రత్ జైద్ (రజి) కుమారుడైన హజ్రత్ ఉసామా(రజి) ఇలా తెల్పిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని అనగా హజ్రత్ ఉసామా(రజి)ను మరియు హజ్రత్‌హసన్ (రజి)ను ఎత్తుకొని ఓ అల్లాహ్ నీవు ఈ ఇరువురిని ప్రేమించుము. ఎందుకనగా నేను ఈ ఇరువురిని ప్రేమిస్తున్నాను అని దుఆ చేసేవారు. (సహి బుఖారి కితాబుల్ ఫజాయిల్

అస్సుహాబ నబీయ్యి సల్లల్లాహు అలైహి వసల్లం బాబ్ జికర్ ఉసామా బిన్ జైద్ (రజి) హదీస్ 3735)

హజ్రత్ జబల ఇట్లు ఉల్లేఖించిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఏదేని యుద్ధమునకు వెళ్లకుండా వున్నప్పుడు తమ ఖడ్గము హజ్రత్ అలీ, హజ్రత్ జైద్ తప్ప మరెవరికి ఇచ్చేవారు కాదు. (కంజులుల్ ఆమాల్, సంపుటి 13, పుట 397, బాబ్ ఫజాయిలు స్సహాబ అర్ఫూ అజ్జాయి జైద్ బిన్ హార్స (రజి) హదీస్ 37066, ప్రచురణ మోసతతుర్రిసాలతు బెహ్‌రూత్ 1985)

హజ్రత్ జబల మరో కథనము ఇట్లు ఉల్లేఖించిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు రెండు అంబారీలు (కుజావా)లు కానుకగా వచ్చెను. వాటిలోని ఒక దానిని వారు సల్లల్లాహు అలైహి వసల్లం వుంచుకొని రెండవది హజ్రత్ జైద్‌కు ఇచ్చిరి. (కంజులుల్ ఆమాల్, సంపుటి 13, పుట 397, బాబ్ ఫజాయిలు స్సహాబ అర్ఫూ అజ్జాయి జైద్ బిన్ హార్స (రజి) హదీస్ 37067, ప్రచురణ మోసతతుర్రిసాలతు బెహ్‌రూత్ 1985)

మరల హజ్రత్ జబల గారే ఇట్లు ఉల్లేఖించిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంనకు రెండు చొక్కాలు కానుకగా వచ్చెను. వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఒక దానిని తమ వద్ద వుంచుకొని రెండవది హజ్రత్ జైద్‌కు ప్రసాదించిరి. (అల్ ముస్తద్రికుల్ అలా సహియైయిన్ లిల్ హాకిమ్ సంపుటి 3, పుట 241, కితాబు మఅరుఫతుస్సహాబ జికర్ మనాకిబ్ జైదుల్ హుబ్బి బిన్ హార్స(రజి)హదీస్ 4963దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2002)

హజ్రత్ జైద్ బిన్ హార్సను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రేమగా పిలిచేవారు. హజ్రత్ జైద్ గురించి నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. అల్లాహ్ తఆలా కరుణించిన వ్యక్తి జైద్ నాకు ప్రజలలో అందరికంటే ఎక్కువ ఇష్టమున్నవాడు.అల్లాహ్ తాలా ఇస్లాం ద్వారా వారిని అనుగ్రహించెను, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి స్వతంత్రమునిచ్చి అనుగ్రహించిరి. (అల్ ఇస్తియాబ్ మఅరుఫతిస్సహాబ సంపుటి 2, పుట 117, జైద్ బిన్ హార్స(రజి) దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 2010)

మౌతా యుద్ధమును గూర్చి వివిధ చరిత్ర పుస్తకాలలో ఉన్న అంశాలను క్రూడికరించి మీ ముందు తెల్పుచున్నాను. హిజ్రి 11వ సం॥ సిఫర్ నెలలో మౌతా యుద్ధమునకు ప్రతీకారము తీర్చుకొనుటకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఒక పెద్ద సైన్యమును సిద్ధము చేసిరి. రోమ్‌నకు వ్యతిరేకంగా యుద్ధము చేయుటకు సిద్ధము కావలెనని రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. మౌతా యుద్ధం తరువాత తయారు చేసిన ఈ సైన్యానికి హజ్రత్ జైద్ బిన్ హార్స(రజి)కు ఎలాంటి ప్రత్యక్ష సంబంధము లేకుండెను. ఎందుకనగా వారు (రజి) ముందుగానే అమరులైరి. కాని సైన్యాన్ని సిద్ధము చేయునప్పుడు హజ్రత్ జైద్ (రజి) ప్రస్తావన వచ్చును. కావున ఈ అంశమును కూడ ప్రస్తావించుచున్నాను. కొంత మేరకు హజ్రత్ ఉసామా(రజి)ను గూర్చి ప్రస్తావించడం జరిగింది. హజ్రత్ ఉసామా(రజి) బద్రి అనుచరులు కారు. బదర్ యుద్ధ సమయంలో వారు బాలుడిగానే యుండిరి. కాని నేను అనుచరులను గూర్చి ప్రస్తావించుచుండగా వారి ప్రస్తావన కూడ వచ్చింది. కావున వారిని గూర్చి కూడ మీకు తెలిపాను. మొత్తానికి ఈ సైన్యము సిద్ధమైనప్పుడు మరుసటి రోజు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉసామా బిన్ జైద్‌ను పిలిపించి ఆ యుద్ధమునకు సైన్యాధికారిగా నియమించి, ఇట్లు ఉపదేశించిరి. నీ తండ్రి అమరుడైన ప్రదేశానికి వెళ్లుము, సిరియా వైపు వెళ్ళుటకు ఆదేశించిరి. అతి వేగంగా ప్రయాణించుము. వారికి తెలియక ముందే అక్కడికి చేరుకొనుము. ఉదయాన్నే ఉబ్నా ప్రజలపై దాడి చేయుము. అనగా ఉబ్నా సిరియా దేశంలోని బల్కా ప్రాంతపు సమీపంలో ఉన్నటు వంటి మౌతా ప్రాంతములోని ఒక ప్రదేశం. అక్కడే మౌతా యుద్ధం జరిగింది. డెన్మార్క్ మరియు వాదియుల్ ఖుర్‌ఆ ప్రాంతాల మధ్య ఈ ప్రదేశం గలదు. ఈ ప్రాంతమును గూర్చి ఈ విధముగా చరిత్రలో గలదు. హజ్రత్ లూత్ (అ) వంశస్తులలో ఒకరైన బాలిఖ్ అనే వ్యక్తి ఈ నగరాన్ని నిర్మించినాడు. దారుమ్‌ను గూర్చి కూడ ఈ విధముగా గలదు. మిసర్ వెళ్ళుచుండగా ఫలస్తీన్ లోని ఘజా ప్రాంతంలోని ఒక ప్రాంతం. హజ్రత్ జైద్ ప్రతీకారము తీర్చుకొనుటకు ఆయా ప్రాంతాలను తమ గుర్రాలతో తొక్కించుము అని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిరి. మరల ఉసామాతో ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. దారి చూపువారిని కూడ తమ వెంట తీసుకెళ్లుము. అక్కడి సమాచారము తెలుసుకొనుటకు కూడ కొందరిని నియమించుము. తద్వారా వారు అక్కడి పరిస్థితులను మీకు తెలుపుదురు. అల్లాహ్ తఆలా మీకు విజయము నొసంగుగాక!. త్వరగా తిరిగి రండి!. అప్పటికి హజ్రత్ ఉసామా వయసు 17-20 సం॥లు మాత్రమే. హజ్రత్ ఉసామా కొరకు ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం స్వహస్తాలతో ఒక పతాకము సిద్ధము చేసిరి. అల్లాహ్ నామముతో అతని మార్గములో జిహాద్ చేయుము. అల్లాహ్‌ను నిరాకరించిన వారితో యుద్ధము చేయుము అని మరల సూచించిరి. హజ్రత్ ఉసామా (రజి) జెండా తీసుకొని బయలుదేరిరి. తరువాత ఆ జెండాను బురైదా (రజి)కు అప్పగించిరి. జుర్ఫ్ ప్రాంతములో ఈ సైన్యం ఏకమవసాగెను. జుర్ఫ్ కూడ మదీనా నుండి మూడు మైళ్ళ దూరంలో ఉన్నటువంటి ప్రాంతం. ఆ సైన్యంలో మొత్తం మూడు వేల సైనికులు గలరు. ఆ సైన్యంలో ముహాజిర్లు , అన్సారులు ఇరువురు పాల్గొన్నారు. వారిలో హజ్రత్ అబూబకర్ (రజి), హజ్రత్ ఉమర్ (రజి) హజ్రత్ అబూ ఉబైదహ్ బిన్ జర్రాహ్(రజి) హజ్రత్ సఅద్ బిన్ వఖాస్ (రజి) వంటి గొప్పగొప్ప అనుచర వర్గీయులు కూడ గలరు. అయినా కూడ వారిపై 17 నుండి 18 సంవత్సరాల వయస్సు ఉన్నటువంటి ఉసామా(రజి)ను నాయకుడిగా నియమించిరి.

ఇంత చిన్న ప్రాయములోనే ఉన్న బాలుడిని ప్రథమ స్థానములో ఉన్నటు వంటి ముహాజిర్లకు నాయకునిగా నియమించినారని కొందరు హజ్రత్ ఉసామా(రజి)పై ఆరోపణలు చేశారు. అందుకు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా కోపగించుకొనిరి. హుజూర్ (స) ఆ సమయంలో ఒక తలపాగను తలకు చుట్టుకొని, ఒక దుప్పటిని కప్పుకొని యుండిరి. వెంటనే హుజూర్ (స) గద్దెనెక్కి ఇట్లు ప్రసంగించిరి. ఓ ప్రజలారా! మీలో కొందరు ఉసామా నాయకత్వంను గూర్చి చర్చించుకుంటున్న విషయం నా వరకు చేరుకుంది. నేను ఉసామాను నాయకుడిని చేసినందున మీరు ఆరోపణలు చేయుచున్నచో, ఇతని తండ్రిని నాయకుడిని చేసినందుకు కూడ గతంలో మీరు ఆరోపణలు చేశారు. దేవుని ప్రమాణం! అతడు కూడ నాయకత్వ సామర్థ్యాలను కల్గి యున్నాడు. అనగా హజ్రత్ జైద్ (రజి), అతని తరువాత అతని కుమారుడు కూడ నాయకత్వ సామర్థ్యాలను కల్గియున్నాడు. అతడు నాకు అందరికన్న ఎక్కువ ఇష్టమైనవారిలో గలడు. వీరివురు నిశ్చయముగా అన్ని శుభములకు అర్హులు. మరల హుజూర్ (స) ఇలా ప్రసంగించిరి. ఇతని అనగా ఉసామ (రజి) శుభప్రదమైన ఆదేశములను పాటించుము. ఎందుకనగా ఇతడు మీలోని ఉత్తమమైన వారిలో ఒకరు. ఇది రబీఉల్ అవ్వల్ మాసపు 10వ రోజు, శనివారపు దినము. అనగా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మరణించుటకు రెండు రోజుల ముందునాటి విషయం. హజ్రత్ ఉసామా(రజి)తో ప్రయాణించుటకు సిద్ధముగా ఉన్న ముసల్మానులు రసూలుల్లాహ్ సల్లల్లాహు

| హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఉపదేశములు | "మీకు ఇహలోక పరలోక సాఫల్యము కలగాలని, ప్రజల హృదయాలను జయించాలని మీరు ఆశించుచున్నచో పవిత్రతను ఆచరించుము. తమను తాము చక్కదిద్దుకొని ఇతరులకు ఆదర్శముగా నిలువగలరు. అప్పుడు మీరు సఫలమగుదురు." (ఖుత్బా జుమా 1 జనవరి 216) |
|---|---|

దుఆ ఆశించువారు: *Darga sb, jamat Ahmadiyya Vizag (A.P)*

| ఇమామ్ వాఖ్యములు | **"ముస్లిములు పవిత్ర ఖుర్‌ఆన్‌ను సంపూర్ణముగా ఆచరించనంత వరకు వారెలాంటి అభివృద్ధి సా ధించరు"** **(మల్ఫూజాత్ సంపుటి 4 పుట 379)** |
|---|---|


దుఆ ఆశించువారు: *Mahmood Ahmad Babu sb, Ameer Zila, Mahaboob Nagar, (Telangana)*

అలైహి వసల్లంతో సెలువు తీసుకొని జుర్ఫ్ ప్రాంతములో ఉన్నటువంటి సైన్యంలో చేరుతున్నారు. ఒకవైపురసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆరోగ్యము క్షీణించసాగెను. అయినను ఉసామా సైన్యమును పంపవలెనని హుజూర్(స) ఆదేశించుచుండిరి. ఆదివారం రోజున రసూలుల్లా సల్లల్లాహు అలైహి వసల్లం ఆరోగ్యం మిక్కిలి క్షీణించినది. హజ్రత్ ఉసామా (రజి) సైన్యం నుండి వెనుదిరిగి వచ్చేవరకు ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మూర్ఛపోయి ఉండిరి. ఆ రోజు హుజూర్ (స)కు పాలు త్రాగించిరి. హజ్రత్ ఉసామా(రజి) తన తలను వంచి రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంను ముద్దు పెట్టుకొనిరి. ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మాట్లాడలేక పోవుచుండిరి. కాని తమ రెండు చేతులను ఎత్తి ఆకాశము వైపు చూపిస్తూ ఉండేవారు, హజ్రత్ ఉసామా(రజి) తలపై పెట్టేవారు. అందుకు ఉసామా(రజి) హుజూర్ (స) నా కోసం దుఆ చేయుచున్నారని గ్రహించానని తెల్పిరి. హజ్రత్ ఉసామా(రజి) సైన్యం వద్దకు వెళ్ళిపోయిరి. సోమవారము రోజున హుజూర్ (స) ఆరోగ్యము కొంత మేరకు మెరుగు పడగా అల్లాహ్ తఆలా శుభముతో బయలు దేరమని వారు సల్లల్లాహు అలైహి వసల్లం హజ్రత్ ఉసామాను ఆదేశించిరి. హజ్రత్ ఉసామా (రజి) హుజూర్ (స)తో అనుమతి తీసుకొని అక్కడి నుండి బయలు దేరిరి. సైనికులను కూడ ప్రయాణానికి సిద్ధముకమ్మని ఆదేశించిరి. ఇంతలోనే హజ్రత్ ఉసామా(రజి)కు ఆcహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం చాలా క్షీణించింది. బహుశ చివరి క్షణాలలో ఉన్నారని అనిపించుచున్నది అని వారి తల్లి హజ్రత్ ఉమ్మె ఐమన్ ద్వారా సమాచాము అందినది. ఈ బాధాకరమైన వార్త వినగానే హజ్రత్ ఉసామా, హజ్రత్ ఉమర్, హజ్రత్ అబూ ఉబైదహ్ తక్షణమే రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి, చూడగా వారు కొనఊపిరితో వుండిరి.

12 రబీవుల్ అవ్వల్ తేదీన హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం సాయంత్రం వేళ పరమపదించిరి. కావున ముస్లిముల సైన్యము జుర్ఫ్ ప్రాంతము నుండి తిరిగి మదీనాకు చేరుకొనెను. హజ్రత్ ఉసామా పతాకమును రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం తలుపునకు హజ్రత్ బురైదహ్(రజి) కట్టివేసిరి. హజ్రత్ ఉసామా తమ లక్ష్యమును నెరవేర్చుటకు బయలు దేరాలని, అందుకు ఈ పతాకము తీసుకొని ఉసామా(రజి) ఇంటికి వెళ్ళమని హజ్రత్ అబూబకర్ ఖలీఫాగా ఎన్నికైన తరువాత హజ్రత్ బురైదహ్‌ను ఆదేశించిరి. హజ్రత్ బురైదహ్(రజి) పతాకము తీసుకొని సైన్యపు మొదటి ప్రాంతానికి చేరుకొనిరి. ఆcహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించిని తర్వాత ఆరబ్ దేశమంతటా సామాన్య ప్రజలు, ప్రభావశీలురు , అన్ని తెగల, వర్గాల ప్రజలు ధర్మభ్రష్టులగు చుండిరి. వారి దాంభికత్వము కూడ బయపడుచుండెను. ఆ సమయంలో యూదులు, క్రైస్తవులు అందరు ఇప్పుడు ఏమి జరుగుతుందో చుద్దాం అని కన్నులు పెద్దవిగా చేసుకొని ఆనందంతో అవకాశం కొరకు ఎదురు చూడసాగిరి. ప్రతీకారం తీర్చుకొనుటకు సిద్ధమవుచుండిరి. ఒకవైపు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అస్తమించడం, మరోవైపు ముసల్మానుల సంఖ్య తక్కువగా ఉండడం వలన ముసల్మానుల పరిస్థితి చూపరులకు ఎలా ఉన్నదనగా తూఫాన్ రాత్రిలో గొర్రెల మంద వలె కనిపించుచుండెను. చాలా క్లిష్టమైన పరిస్థితులుగా కనపడుచున్నవి. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడు ఉసామా సైన్యమును వాయిదా వేయుట మంచిదని, ఆలస్యముగా పంపుట ప్రయోజనకరముగా ఉండునని గొప్ప గొప్ప అనుచరులు హజ్రత్ అబూబకర్ (రజి) కు సలహాలిచ్చిరి.

కాని హజ్రత్ అబూబకర్ ఒప్పుకొనక ఇట్లనిరి. ఒకవేళ రాంబంధులు నన్ను పొడుచుకుంటూ తిన్నను, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సిద్ధము చేసిన ఈ సైన్యమును ఆపను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును నేను అమలు పరిచి తీరుతాను. ఆc నగరంలో నేను ఒక్కడినే మిగిలిపోవుచున్నను ఆ ఆదేశమును అమలుపరిచి తీరుతాను. మొత్తానికి వారు ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశమును ఆదే స్థాయిలో ఆచరించి చూపుటకు ప్రయత్నించిరి. కావున ఉసామా(రజి) సైన్యము వెళ్ళుటకు నిర్ణయించబడిన అనుచరులు జుర్ఫ్ ప్రాంతమునకు చేరుకొగలరని ఆదేశించిరి. ఉసామా (రజి) సైన్యంలో ఉన్నటువంటి ప్రతి వ్యక్తి, రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ సైన్యంలో చేరాలని ఆదేశించిన ప్రతి వ్యక్తి ఈ యుద్ధంలో పాల్గొనకుండా తప్పుకోరాదు, వారు సైన్యంను వీడి ఇంటి వద్ద ఉండుటకు నేను అనుమతించను అని, ఒకవేళ వారు నడిచివెళ్ళవలసి వచ్చినను వారు తప్పకుండ నడిచి వెళ్ళవలెనని హజ్రత్ అబూబకర్ (రజి) ప్రకటించిరి. అలా మరొక్కసారి సైన్యము సిద్ధమైనది. ప్రమాదకరమైన పరిస్థితుల వలన ఈ సైన్యమును ప్రస్థుతం నిలిపివేయుట మంచిదని అనుచరులు మరోసారి సలహాలనిచ్చిరి. ఒక కథనము ప్రకారం హజ్రత్ ఉసామా(రజి) హజ్రత్ ఉమర్ (రజి)తో మీరు హజ్రత్ అబూబకర్ (రజి) వద్దకు వెళ్ళి ఈ సైన్యాన్ని పంపకుండా ఆపమని తెలుపండి, తద్వారా ధర్మభ్రష్టులవుచున్న వారితో పోరాడుచు, ఖలీఫతుర్రసూల్ మరియు హరమే రసూలు మరియు ముసల్మానులను అవిశ్వాసుల దాడుల నుండి కాపాడవచ్చును అని విన్నవించుకొనిరి. అలాగే కొందరు అన్సార్ అనుచరులు హజ్రత్ ఉమర్‌తో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా అయిన హజ్రత్ అబూబకర్ సైన్యమును పంపుటకే నిర్ణయించుకొన్నచో ఈ సైన్యాధికారిని మార్చి హజ్రత్ ఉసామా కంటే పెద్ద వయస్కుడైన వ్యక్తిని నియమించాలని మనవి చేయండని విన్నవించుకొనిరి. ప్రజల ఈ అభిప్రాయముతో హజ్రత్ అబూకర్ వద్దకు హజ్రత్ ఉమర్ చేరుకొని తెలుపగా హజ్రత్ అబూబకర్ గట్టి నమ్మకముతో ఇట్లనిరి. అడవి జంతువులు మదీనాలో ప్రవేశించి నన్ను ఎత్తుకెళ్ళినను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆదేశించిన పనిని నేను నిలిపివేయను అని సమాధానమిచ్చిరి. అప్పుడు వారికి అన్సార్ అనుచరులు విన్నపంను హజ్రత్ ఉమర్ (రజి) వినిపించగా ఆ విన్నపంను వినగానే హజ్రత్ అబూబకర్ (రజి) ఎంతో దగ్ధమైన గొంతుతో అతనిని అనగా ఉసామా (రజి)ను ఆc హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నాయకుడిగా నియమించిరి. అలాంటప్పుడు వారిని వారి స్థానమును నుండి తప్పించమని మీరు నాకు సలహాలిస్తున్నారా? అని హెచ్చరించిరి. హజ్రత్ అబూబకర్ దృఢమైన నిర్ణయమును విని హజ్రత్ ఉమర్ తిరిగి సైన్యము వద్దకు చేరుకొనిరి. ఏమైనదని ప్రజలు ప్రశ్నించగా నా దగ్గరికి ఎవరు రాకూడదని హజ్రత్ ఉమర్ చాలా కోపముతో అనిరి. మీ వల్లనే నేడు నన్ను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా కోపగించుకొనిరి అని బాధపడిరి.

హజ్రత్ అబూబకర్ ఆదేశము మేరకు జుర్ఫ్ ప్రాంతములో ఉసామా సైన్యము మరల గుమికూడెను. హజ్రత్ అబూబకర్ స్వయంగా అక్కడికి వెళ్లి సైన్యమును పరిశీలించి, తీర్చి దిద్దిరి. బయలుదేరు దృశ్యము కూడ ఎంతో అపురూపముగా యుండెను. ఆ సమయంలో హజ్రత్ ఉసామా స్వారి అయివుండగా హజ్రత్ అబూబకర్ ఖలీఫతుర్రసూల్



నడుచుచుండిరి. ఓ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఖలీఫా! మీరైనా ఎక్కండి లేక నేనైనా క్రిందికి దిగుతాను అని హజ్రత్ ఉసామా వేడుకొనిరి. అందుకు హజ్రత్ అబూబకర్ ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణము! నువ్వు క్రిందికి దిగకూడదు, నేను పైకి ఎక్కను. దైవ మార్గములో ఒక ఘడియ కొరకైనా నేను నా కాళ్ళతో నడవకూడదా?. ఎందుకనగా వీరుడు నడిచినప్పుడు ఒక అడుగుకు బదులు ఏడు వందల పుణ్యములు అతని కొరకు వ్రాయబడును. ఏడు వందల రెట్లు అతని స్థాయి అంతస్థులను పెంచును. అతని ఏడు వందల పాపములను క్షమించును.

హజ్రత్ అబూబకర్ (రజి)కు మదీనాలో ఉన్నటువంటి ఎన్నో పనుల రీత్య హజ్రత్ ఉమర్ (రజి) అవసరముండెను. అయినను హజ్రత్ అబూబకర్ (రజి) వారిని స్వయముగా నిలుపుకొనుటకు బదులుగా ఒకవేళ మీరు మంచిదని భావించినచో హజ్రత్ ఉమర్(రజి)ను మదీనాలో హజ్రత్ అబూబకర్ వద్ద ఉండుటకు అనుమతించ గలరని ఉసామా(రజి)ను కోరిరి. హజ్రత్ ఉసామా(రజి) వర్తమాన ఖలీఫ విన్నపం మేరకు వెంటనే హజ్రత్ ఉమర్ (రజి)ను మదీనాలో ఉండుటకు అనుమతినిచ్చిరి. ఈ సంఘటన తర్వాత హజ్రత్ ఉసామాను హజ్రత్ ఉమర్ కలిసినపుడల్లా వారినుద్దేశించి **'అస్సలాము అలైక అయ్యుహాల్ అమీర్'** అనగా ఓ నాయకుడా! నిన్ను అల్లాహ్ కరుణించుగాక! అని పలకరించేవారు. బదులుగా హజ్రత్ ఉసామా ఇట్లనేవారు. **'ఘఫరల్లాహు లక యా అమీరల్ ముమినీన్'** అనగా ఓ విశ్వాసుల నాయకుడా! అల్లాహ్ తఆలా మిమ్ములను క్షమించుగాక!

మొత్తానికి హజ్రత్ ఉసామా సైన్యమునుద్దేశించి హజ్రత్ అబూబకర్ ఇట్లు ఉపదేశించిరి. మీరు అవినీతికి పాల్పడకూడదు. వాగ్దాన భంగము చేయరాదు. మృతి చెందిన శత్రువు శవమును అవమానపర్చకూడదు. చిన్న పిల్లలు, వృద్ధులు, స్త్రీలను హతమార్చకూడదు. ఖర్జూర వృక్షములను నరికి వేయరాదు, దహనం చేయకూడదు. గొర్రె, ఆవు, ఒంటెను భుజించడానికి తప్ప వధించరాదు. మరల వారిట్లనిరి. తమను తాము ప్రార్థన కొరకు చర్చిలకు సమర్పించుకున్న వారు తప్పక మీకు తారసపడుదురు. అటువంటి వారిని విడిచిపెట్టవలెను. తమ పాత్రలలో విభిన్న రకాల ఆహారము తీసుకొని వచ్చి మీకు ఇచ్చేవారు కూడ తప్పక మీకు కలుస్తారు. వాటిని మీరు భుజించినప్పుడు బిస్మిల్లాహ్ చదువుము. తమ తల నీలాలు తీయించుకొని నాలుగు వైపుల నుండి తాళ్ళ వలె తమ కేశములను పెంచుకున్న వారితో మీరు తప్పక కలుస్తారు. ఇటువంటి వారిని మీరు ఖడ్గముతో కొద్దిగా గాయపరచి అల్లాహ్ నామముతో తమను తాము రక్షించుకొనుము. అల్లాహ్ తఆలా మిమ్ములను శాపము, మహమ్మారి రోగము నుండి రక్షించుగాక! మరల హజ్రత్ అబూబకర్ (రజి) హజ్రత్ ఉసామా(రజి) తో ఇట్లనిరి. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం అనుమతించిన పనులను తప్పక చేయుము.

మొత్తానికి ఈ విషయాలన్నింటిని పరిశీలించినచో ఎక్కడైతే హజ్రత్ అబూబకర్ (రజి) హజ్రత్ ఉసామా(రజి) కు యుద్ధ విధి విధానాలను గూర్చి తెల్పినారో అనగా, ఎక్కడ ఎలాంటి దౌర్జన్యము జరుగకూడదు అని అక్కడే ఈ సైన్యం విజయమును సాధిస్తుందనే నమ్మకం హజ్రత్ అబూబకర్ (రజి) ఉన్నట్లు అర్థమవుతుంది. అందుకే మీకు విజయం చేకూరుతుంది అని వారు (రజి) వారికి తెల్పిరి. మొత్తానికి 11వహిజ్రి సం॥లో రబీవుల్ ఆఖర్ మొదటి రోజున హజ్రత్ ఉసామా తమ సైన్యమును తీసుకొని మదీనా నుండి బయలు దేరిరి. ఒక్కొక్క ప్రాంతమును దాటుచు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచనల మేరకు సీరియాలోని అబ్నా ప్రాంతమునకు చేరుకొనిరి. ఉదయం నగర నాలుగు వైపుల నుండి వారిపై దాడికి దిగిరి. ఆ యుద్ధంలో వారి నినాదం యా మన్సూరు! అమతి. అనగా ఓ సహాయం పొందిన వాడా! హతమార్చుము. ఈ యుద్ధములో ముస్లిములను ఎదురించిన ప్రతి వ్యక్తి హతమయ్యెను. చాలా మంది ఖైదీలుగా బంధించబడిరి. ఇదే విధంగా అధిక మోతాదులో యుద్ధ సామాగ్రి కూడ లభించెను. దానిలోని 5వ భాగము వుంచుకొని మిగతా మొత్తం సైన్యములో పంచిపెట్టిరి. ఈ యుద్ధము ముగించుకొని సైన్యము అక్కడే ఒక రోజు బస చేసిన తర్వాత మరుసటి రోజు మదీనా కొరకు బయలు దేరెను.

ఈ విజయమును గూర్చిన శుభవార్తనందించుటకు హజ్రత్ ఉసామా(రజి) ఒక వ్యక్తిని మదీనాకు పంపిరి. ఈ యుద్ధంలో ఏ ఒక్క ముసల్మానుడు అమరుడు కాలేదు. ఈ సైన్యము విజయము, సఫలముతో మదీనాకు తిరిగి వచ్చినప్పుడు హజ్రత్ అబూబకర్ (రజి) స్వయముగా ముహాజిర్లు, అన్సార్‌లతో కలసి మదీనా శివారుకు వచ్చి వారికి ఆడంబరంగా స్వాగతం పలికిరి. హజ్రత్ బురైదహ్ (రజి) పతాకము చేత పట్టుకొని సైన్యము ముందు నడుచుచుండిరి. సైన్యము మదీనాలో ప్రవేశించి మస్జిద్ నబ్వీ వరకు చేరుకొనెను. హజ్రత్ ఉసామా మస్జిద్‌లో రెండు రకాతులు నఫిల్ చదివిన తర్వాత తమ ఇంటికి వెళ్లిపోయిరి. కొన్ని విభిన్న కథనాల మేరకు ఈ సైన్యం 40 నుండి 70 రోజుల వరకు బయట గలదు. ఉసామా సైన్యమును పంపినందుకు ముస్లిములకు చాలా ప్రయోజనము కలిగినది. ఎందుకనగా ముస్లిములకు శక్తి యుక్తులు లేనిచో వారు ఎట్టి పరిస్థితిలోను ఈ సైన్యమును పంపేవారు కాదని అరబ్బులు మాట్లాడుకోసాగిరి. ఈ విధంగా ముస్లిములకు వ్యతిరేకంగా చేయదలచిన కుట్రల నుండి అవిశ్వాసులు దూరముండిరి. (అత్తబుకాతుల్ కుబ్రా సంపుటి 2, పుట 145-157, సిరియా ఉసామా బిన్ జైద్ (రజి) దారుల్ కుతుబుల్ ఇల్మియత్ బెహ్‌రూత్ 1990)(సీరత్ హల్బియా సంపుటి 3, పుట 291-294, సిరియతు ఉసామా... బెహ్‌రూత్ 2002)(అల్ కామిల్ ఫిత్తారీఖ్ సంపుటి 2, పుట 199-200, జైషే ఉసామా.....బెహ్‌రూత్ 2006) (ముఅజముల్ బలదాన్ సంపుటి 1, పుట 579, అల్ బల్ఖా సంపుటి 2, పుట 483, అద్దారూమ్ సంపుటి 2, పుట 149, అల్ జర్ఫా ప్రచురణ బెహ్‌రూత్)

అల్లాహ్ తాలా అనుగ్రహము, అతని సహాయ సహకారముల వలన హజ్రత్ ఉసామా (రజి)రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఒక్కొక్క ఆదేశాన్ని ఒక్కొక్క అక్షరం పొల్లుపోగుండా ఆచరించి చూపిరి. నిర్వాహణ మరియు నాయకత్వ విషయంలో , యుద్ధ విధానములో గల నైపుణ్యాల, ప్రావీణ్యతల విషయంలో కూడ ఈ యుద్ధానికి గొప్ప ప్రాధాన్యతను చేకూర్చినారు. వీరు గొప్ప నాయకులని హుజూర్ (స) తెలియజేశారు. దేవుని అనుగ్రహము మరియు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం, వర్తమాన ఖలీఫ ఆమోదభరిత దుఆలు, శుభములు అన్నియు హజ్రత్ ఉసామా(రజి) కూడ వారి అమరులైన తండ్రి వలే కేవలం మంచి నాయకులే గాకుండా వారిలో కూడ నాయకత్వ లక్షణాలు, విశిష్టతలు కూడ ఎంతో గొప్ప స్థాయిలో ఉన్నాయని నిరూపించాయి. అంతేగాకుండా వర్తమాన ఖలీఫా గారి దృఢసంకల్పం మరియు విశేష ప్రోత్సాహమే అనేక రకాల అంతర్గత, బహిర్గతల విపత్తుల, ఆరోపణల సమయంలో కూడ సైన్యాన్ని బయటికి పంపుటకు సహాసించిరి. ఆ తరువాత అల్లాహ్ తాలా వారికి విజయాన్ని ప్రసాదిస్తూ ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తరువాత ఇకపై అన్ని రకాల శుభములు కేవలం ఖలీఫా పట్ల ప్రదర్శించూ విధేయతలోనే ఉన్నాయని ముసల్మానులకు మొదటి పాఠాన్ని నేర్పించడం జరిగింది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ ఈ విషయాన్ని సిర్రుల్ ఖిలాఫలో ప్రస్తావించడం జరిగింది. (సిర్రుల్ ఖిలాఫ, రూహాని ఖజాయిన్ సంపుటి 8, పుట 394, అనుబంధము).

మన నాయకుడు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్‌నకు ప్రియులైన, ఆప్తులైన హజ్రత్ జైద్ బిన్ హార్స, వారి కుమారుదు హజ్రత్ ఉసామా బిన్ జైద్‌పై అల్లాహ్ తఆలా వేలాది కరుణలు, శుభములను కురిపించుగాక!.

(2వ పేజి తరువాత) కొందరు సదుద్దేశులు కూడ యుందురు. ఎవరైనా స్వయముగా ముద్రించుచున్నా, వారి దృష్టిలో అది మంచిదైనచో దానిని విశాలముగా చేయవలెను, వ్యాపింపజేయవలెను. ఎవరి హృదయములోనైనా మంచి ఆలోచన కలిగినచో, దానితో కరపత్రము సిద్ధము కాదలచినచో అకర్షితముగా యున్నచో, ప్రజల దృష్టిని అకర్షించే విధముగా యున్నచో, వ్యాసము కూడ మంచిగా యున్నచో దానిని జమాఅత్ వ్యవస్థకు అందించవలెను. అది లాభదాయకమైనచో దానిని జమాఅత్ వ్యవస్థ ముద్రించవలెను.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం, అనుచరుల గురించి గల హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు తెలిపిన పలు సంఘటనలను ఇప్పుడు నేను ప్రస్తావింతును.

ఒక చోట వారిట్లనిరి. "అఫ్ఘానిస్తాన్ అమరులపై రాళ్ళు పడుచున్నప్పుడు వారు ఆందోళన చెందలేదు. స్థిరత్వము, ధైర్యముతో వాటిని స్వీకరించేవారు. విపరీతముగా వారిపై రాళ్ళు పడినప్పుడు సాహిబ్జాదహ్ అబ్దుల్లతీఫ్ షహీద్, నీమతుల్లాహ్ ఖాన్ గారు ఇతర అమరులు ఇట్లనిరి. ఓ అల్లాహ్! వీరిని కరుణించి వీరికి మార్గదర్శనము ప్రసాదించుము. వాస్తవమేమనగా ప్రేమనురాగము మానవునిలో యున్నప్పుడు అతని రూపు రేఖలు మారిపోవును. అతని మాటలో ప్రభావము ఏర్పడును. అతని ముఖ కాంతి కిరణాలు ప్రజలను ఆకర్షించును." హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. "నాకింకా గుర్తున్నది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలములో వేలాది మంది (ఇక్కడికి) ఖాదియాన్ వచ్చినారు. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూచినప్పుడు ఈ ముఖము అసత్యులది కాదని అనిరి. వారు వారి నోట ఒక్క అక్షరము కూడ వినకుండానే విశ్వసించిరి". (అల్లాహ్ తాలా కె రాస్తేమేం తకాలీఫ్-అన్వారుల్ ఉలూమ్ సంపుటి 13 పుట 96)

ఈ ఉదాహరణలు నేడు కూడ మనకు కనిపించుచున్నవి. మేము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిత్రమును చూచి ఇది అసత్యుల ముఖము కాజాలదని బైఅత్ చేసినామని నాకు అనేక ఉత్తరములు వచ్చుచుండును.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం ఇట్లనేవారని మరల హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లు ప్రస్తావించిరి. మన జమాఅత్‌లో మూడు రకాల ప్రజలు చేరినారు. ఇట్లనిరి. "నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో అనేక సార్లు విన్నాను. వారిట్లనేవారు. మన జమాఅత్‌లో మూడు రకాల ప్రజలున్నారు. మొదటి రకము ఏమనగా నా ప్రకటనను అర్థము చేసుకొని, గమనించి అహ్మదీయులైనారు". (ఆ కాలములో ఇస్లాం స్థితి చాలా చెడిపోయి యుండెను. ముస్లిముల ఐక్యత పూర్తిగా విచ్ఛిన్నమై యుండెను. అందుకే వివిధ రకముల వ్యక్తిత్వములు ఏర్పడెను. ఆ వివిధ రకముల వ్యక్తిత్వములు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటనను విని, జమాఅత్ సిద్ధమగుచు చూచి, స్వీకరించిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారి స్థితులను వివరించుచున్నారు. వారు మూడు రకాలు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మొదటి రకము వారి గురించి ఇట్లంటున్నారు.) వీరు నా ప్రకటటను అర్థము చేసుకొని ఆలోచించి అహ్మదీయులైనారు. "నా అవతరణ ఉద్దేశమేమిటో వారికి తెలుసు. గతములో సందేశహరుల జమాఅత్‌లు ఏ విధముగా త్యాగములు చేసినవో మనము కూడ త్యాగములు చేయవలెనని వారికి తెలుసు.

కాని మరొక రకము ఏమనగా వారు హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ గారి వలన మాత్రమే మన జమాఅత్‌లో చేరినారు". (వారికి అవతరణ ఉద్దేశము తెలియదు. కాని వారు హజ్రత్ మౌల్వీ నూరుద్దీన్ గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించినారని మాత్రమే బైఅత్ చేసినారు. ఇట్లనిరి) "వారు వారి ఉపాధ్యాయులుగా యుండిరి. వారిని గౌరవనీయు, వివేకులుగా భావించేవారు. మౌల్వీ గారు అహ్మదీ అయినందున రండి మనము కూడ అహ్మదీలగుదామని వారనిరి. మన సంస్థతో వారి బంధము మౌల్వీ గారి వలన ఏర్పడినది. సంస్థ వివేకము, ఉద్దేశమును వారు అర్థము చేసుకోలేదు.

వీరు కాక మరో మూడో రకమైన వర్గము కొందరు యువకులది. వారి హృదయములో ధార్మికంగా కాక పోయినా జాతీయంగా ఇస్లాం బాధ యుండెను. (అనగా ధార్మికంగా ఎలాంటి బాధ లేకుండెను. కాని ముస్లిముల స్థితి చూచి ఒక వర్గము, సంస్థ యుండవలెనని కోరిరి. కనుక ఇటువంటి వారు కూడ జమాఅత్‌లో ప్రవేశించిరి. కాని ధర్మముపై అధిక శ్రద్ధ గలదని తర్వాత వారు చూచినప్పుడు వారిలోని అనేకులు వివిధ సమయములలో విడిపోయిరి. ద్వితీయ ఖిలాఫత్ సమయములో కూడ వారిలోని అనేకులు విడిపోయిరి.

నేడు కూడ ముస్లిములలో నుండి నవయువకులు ఉద్రేకము కలిగి యున్నారు. తప్పుడు మార్గములో ఉగ్రవాద సంస్థలలో చేరి కేవలము ముస్లిముల జాతీయ గుర్తింపు కొరకు జాతీయంగా మన కొరకు ఒక సంస్థ, ఒక వర్గము యుండవలెనని వారు భావింతురు. కాని వారికి ధార్మికంగా ఏమియును తెలియదు. ఇరాక్, సీరియా నుండి అందుచున్న నివేదికలలో ఇట్లుండును. వారి అనేక కార్యముల గురించి ఇవి ఖుర్‌ఆన్, హదీసు ప్రకారము లేవని అడిగినచో మాకీ విషయము తెలియదని వారందురు. మాకు చెప్పిన విధముగా, దీని ద్వారా ముస్లిముల ప్రత్యేకత ఏర్పడుచున్నది. దీనిని మేము ఇస్లాం పేరున స్థాపించవలెను. ఇటువంటి వారు కూడ యుందురు. జాతీయంగా మేము ఏకము కావలెనని వారు కోరుదురని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తెలిపిరి.) "వారిలో ఒక వర్గము యుండవలెను. కొన్ని సంస్థలు ఏర్పాటై పాఠశాలలు జారీ కావలెను." (కొందరు జాతీయపరంగా సత్కార్యములు చేయదలతురు) "కాని సాధారణ ముస్లిముల కొరకు ఒక వర్గము ఏర్పాటు చేయుట వారికి అసాధ్యమైనందున మన వద్ద నున్న ఒక సమూహమును చూచి వారు మన వైపు వచ్చిరి. పాఠశాలలు ఏర్పాటై ప్రజలు పట్టాలు పొందవలెనని వారు కోరుచున్నారు. అందుకే వారు మన జమాఅత్‌ను ధర్మము కాదు, ఒక సంస్థగా భావింతురు. ప్రపంచములో ప్రగతికి భావించు మార్గములు వేరు. ధర్మములో ప్రగతికి భావించు మార్గములు వేరు. సంస్థలు ఒక రకంగా ప్రగతి చెందును, ధర్మము మరో రకంగా ప్రగతి చెందును. ధర్మ ప్రగతికి ప్రవర్తనలను చక్కదిద్దుట అనివార్యము." (ప్రవర్తనలు సరి అగుట, గొప్ప ప్రవర్తనలు యుండుట ధర్మ ప్రగతికి అనివార్యము.) "త్యాగము, అంకిత భావము ఏర్పాటు కావలెను. నమాజులు చదువవలెను." (తద్వారా ఆధ్యాత్మికతలో ప్రగతి కలుగును) "ఉపవాసములు యుండవలెను. అల్లాహ్ తాలాపై నమ్మకము పెంచవలెను. అతని వినమ్రత, విధేయతకై ప్రతిజ్ఞ చేయవలెను. మనము అన్ని విషయములు మాట్లాడినచో ప్రపంచ దృష్టిలో మనము పిచ్చివారమగుదుము. కాని అల్లాహ్ దృష్టిలో మన కంటే గొప్ప వివేకవంతులు ఎవరుండరు. ముస్లిములు ఆర్థిక త్యాగములు చేసినప్పుడు దాంబికులు ముస్లిములను అవివేకులని అందురని పవిత్ర ఖుర్‌ఆన్‌లో గలదు. నగదును వృధా చేయుచున్నారు. తమ నగదును ఏదేని మంచి కార్యములో వినియోగించు తెలివి లేదు. ఏదేని విధముగా వారు సమయములను త్యాగము చేసినప్పుడు వీరు పిచ్చివారని అందురు. తమ సమయమును నాశనము చేయుచున్నారు. వీరు ప్రగతి ఎలా సాధింతురు. అనగా ముస్లిములను వారు అవివేకులు లేదా పిచ్చివారందురు. ఈ రెండు నామములే వారు ముస్లిములకు పెట్టియుండిరి. కాని తర్వాత ఈ అవివేకులే ప్రపంచ ఉపాధ్యాయులుగా ఎదిగిన విషయమును గమనించుము. కనుక దాంబికులు అవివేక పద్ధతి అని అంటున్న ఆ అవివేక పద్ధతిని మన జమాఅత్ అవలంభించనంత వరకు దానికి సఫలము లభించదు. అవసరమొచ్చినప్పుడు మీరు అబద్ధము కూడ చెప్పదలచినచో, అవసరమొచ్చినప్పుడు కుట్ర కూడ చేయదలచినచో, అవసరమొచ్చినప్పుడు మోసముతో పని చేయదలచినచో, అవసరమొచ్చినప్పుడు చాడీలు చెప్పి కూడ లబ్ధి పొందదలచి కూడ సఫలము లభించవలెనని ఆశించినచో అల్లాహ్ తాలా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో వాగ్దానము చేసిన సఫలము మీకెన్నడు లభించదు. ఈ విషయములు ప్రాపంచిక సంస్థలలో పనికి వచ్చును కావచ్చు." (కుట్ర కూడ, మోసము కూడ, చాడీలు కూడ, నిందారోపణ కూడ, ఒకరు మరొకరి పాదములను వెనక్కి లాగుట కూడ) "కాని వీటి వలన ధర్మములో శుభము కలుగక అల్లాహ్ తాలా శాపము పడును."(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 19 పుట 686-688, అల్‌ఫజల్

దినపత్రిక 27 సెప్టెంబర్ 1938 పుట 3)

కనుక సర్వ గొప్ప సత్ప్రవర్తనలు, ఆధ్యాత్మికతలో అభివృద్ధి అను విషయములు ధార్మిక జమాఅత్‌లలో యుండవలెను. కనుక ప్రతి అహ్మది తన విశ్వాస ప్రమాణములను, ఆధ్యాత్మిక ప్రమాణములను గొప్ప స్థాయికి చేర్చవలసిన అవసరమున్నది.

తాలీముల్ ఇస్లాం ఉన్నత పాఠశాల స్థాపన నేపథ్యము, అవసరము గురించి వివరించుచు ఒక సంఘటన వారిట్లు తెలిపిరి. ఒకప్పుడు తాలీముల్ ఇస్లాం కళాశాల ప్రారంభమైనది. ఇన్ని లక్షల రూపాయలు మాకు వెంటనే కావలెనని అప్పుడు ఆలోచించుచుంటిమి. కళాశాల నడుపుటకు ఇన్ని లక్షల సంవత్సర ఆదాయము అవసరముండును. లక్షలలో ప్రణాళికలు రూపొందించుచుంటిమి. అప్పటి ఆ స్థితి గురించి వారిట్లు తెలిపిరి. "వాస్తవానికి ఒకప్పుడు ఉన్నత పాఠశాల కొనసాగించుట కూడ కష్టముండెను. ఇక్కడ ఖాదియాన్‌లో ఆర్యుల ప్రాథమికోన్నత పాఠశాల యుండెడిది. ఆరంభములో ఇందులో మన విద్యార్థులు కూడ పోవడం మొదలు పెట్టిరి. మీరు మాంసము భుజించకూడదని ఆర్య ఉపాధ్యాయులు బోధించడం మొదలు పెట్టిరి." (హిందువులు మాంసము భుజించరు.) "మాంసము భుజించుట హింస అనబడును. ఇస్లాంపై దాడులు జరిగే విధముగా వారు విమర్శలు చేసేవారు. విద్యార్థులు పాఠశాల నుండి వచ్చి ఆయా విమర్శలను తెలిపేవారు." (ఇట్లనిరి) ఇక్కడ ఖాదియాన్‌లో ఒక ప్రాథమిక పాఠశాల యుండెడిది. అందులో కూడ దాదాపు ఉపాధ్యాయులు (టీచర్ల)లందరు ఆర్యులే వచ్చేవారు. ఈ విషయములనే బోధించేవారు. మొదటి రోజు నేను ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యాభ్యాసం కొరకు పోయినప్పుడు (అనగా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు తమ గురించి చెప్పుచున్నారు. నేను ప్రాథమిక పాఠశాలకు విద్యాభ్యాసం కొరకు పోయినాను) మధ్యాహ్నము నా కొరకు అన్నము వచ్చెను. నేను పాఠశాల నుండి బయటికి వచ్చి మధ్యాహ్న భోజనము కొరకు పాఠశాల ఆవరణలో ఒక వృక్షపు నీడన నేను కూర్చున్నాను. నాకింకా మంచిగా గుర్తున్నది. ఆ రోజు కాలేయము వండబడినది. నేను భుజించుటకు దానినే పంపిరి. అప్పుడు మియా అబ్దుల్లాహ్ గారి తండ్రి కీ.శే. మియా ఉమర్‌దీన్ గారు అదే పాఠశాలలో చదివేవారు. కాని వారు పై తరగతిలో చదివేవారు. నేను మొదటి తరగతిలో యుంటిని. నేను భుజించుటకు కూర్చొనగా వారు కూడ వచ్చిరి. వాస్తవానికి వారు ముస్లిములైనను నన్ను చూచి నీవు మాస్ (మాంసము) తింటున్నావా అని అనిరి. ఎందుకనగా ఆర్య ఉపాధ్యాయులు మాంసము తినుట హింస, అతి దుష్టమైన కార్యమని బోధించిరి. మాస్ అను పదమును నేను మొదటి సారి వారితో వినియుంటిని. అందుకే మాంసము అంటున్నారని నేను అర్థము చేసుకోలేక పోతిని. ఇది మాంసము కాదు కాలేయమని నేనంటిని. మాస్ అనగా మాంసమని వారనిరి. ఈ విధముగా మాస్ అను పదమును నేను మొదటి సారి వారి నోట వింటిని. మాంసమును తినుట చాలా దుష్టమైన కార్యము, దాని నుండి దూరముండవలెననే విధముగా వింటిని. సారాంశమేమనగా ఆర్య ఉపాధ్యాయులు ఇటువంటి విమర్శలు చేసేవారు, బాలలు ఇంటికి వచ్చి వారి విమర్శలు చేయుచున్నారని తెలిపేవారు. తుదకు ఈ విషయము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వద్దకు చేరినది. ఏది ఏమైనప్పటికి జమాఅత్ త్యాగము చేసి ఒక ప్రాథమిక పాఠశాల స్థాపించవలెనని వారనిరి. ఇలా ప్రాథమిక పాఠశాల ప్రారంభమయ్యెను. మన జమాఅత్ చాలా గొప్ప లక్ష్యమును పొందినదని భావించబడెను. ఈ కాలములోనే మా బావ నవాబ్ ముహమ్మద్ అలీ గారు ప్రస్థానము చేసి ఖాదియాన్ వచ్చేసిరి. వారికి పాఠశాలల అతి ఉత్సాహము యుండెను. అందుకే వారు మాలియర్ కోట్లలో కూడ ఒక ప్రాథమికోన్నత పాఠశాల స్థాపించియుండిరి. ఈ పాఠశాలను ప్రాథమికోన్నతగా మార్చవలెనని నా కోరిక అని వారనిరి." (అనగా ఖాదియాన్ దానిని) నేనక్కడ పాఠశాలను మూసి వేసి అదే సహాయమును ఇక్కడ చెల్లింతును. తద్వారా ఖాదియాన్‌లో ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటయ్యెను. తర్వాత కొంత నవాబ్ ముహమ్మద్ అలీ గారి ఆసక్తి, కొంత హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ రజియల్లాహు అన్హు గారి ఉత్సాహము వలన ఇక్కడ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని నిర్ణయించబడెను. కనుక ఇక్కడ ఉన్నత పాఠశాల ప్రారంభమయ్యెను. ఇది నామమాత్రపు ఉన్నత పాఠశాలగా యుండెను. ఎందుకనగా ఇందులో బోధించేవారు ఇంట్రన్స్ ఉత్తీర్ణులైన వారుండిరి. బహుశా కొందరు ఇంట్రన్స్ అనుత్తీర్ణులైనవారు కూడ యుండిరి. కాని ఏదో ఒక రకంగా ఉన్నత పాఠశాల పేరు వచ్చెను. ఎకువ ఖర్చు చేసే స్థోమత జమాఅత్‌నకు లేకుండెను. ఆలోచన కూడ వచ్చే అవకాశము లేకుండెను. తుదకు ఒక సమయములో ప్రభుత్వము పాఠశాల, హాస్టల్ల నిర్మాణము వైపు అధిక దృష్టి సారించెను. కనుక పాఠశాల, హాస్టల్ల నిర్మాణము చేయువారికి ప్రభుత్వము సహాయము చేయుననే సమయము వచ్చెను. హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ (రజి) హయాంలో ఇది పాఠశాలతో పాటు హాస్టల్‌గా మారినది. క్రమ క్రమంగా సిబ్బందిలో నైపుణ్యత ఏర్పడినది. విద్యార్థులు చదువుకొనసాగిరి. మొదట 150 యుండగా తర్వాత 3,4 వందలైనారు. అనంతరం 7,8 వందలు కూడ అయినారు. సుదీర్ఘ కాలము వరకు ఈ సంఖ్య కొనసాగెను. 3,4 సంవత్సరములలో ఒక్కసారిగా ప్రగతి చెంది 8 వందల నుండి 17 వందలకు చేరుకొనెను. వెయ్యి కంటే ఎక్కువ అమ్మాయిల సంఖ్య అయినదని నేను విన్నాను. అనగా బాల, మాలికలను కలిపినచో మూడు వేల వరకు సంఖ్య చేరును. తర్వాత మదర్స అహ్మదియ్య, కళాశాల కూడ ఏర్పాటైనవి. నా గత పిలుపు వలన మదర్స అహ్మదియ్యలో కూడ విద్యార్థుల సంఖ్య పెరగడం మొదలైనది. 25, 30 విద్యార్థులు ప్రతి సంవత్సరం రావడం మొదలైనారు. ఈ పరంపర కొనసాగినచో మదర్స అహ్మదియ్య, కళాశాల విద్యార్థుల సంఖ్య 6,7 వందలకు చేరును. లేదా అంత కంటే ఎక్కువే అగును. ఈ విధముగా మనకు ప్రతి సంవత్సరం వంద ముబల్లిఘ్‌లు లభింతురు. ఇంత మంది ముబల్లిఘ్‌లను సిద్ధము చేయవనంత వరకు మనము ప్రపంచములో సరిగ్గా పని చేయలేము." (ఇది కనీస సంఖ్య. అల్లాహ్ తాలా కృపానుసారము ఇప్పుడు వందలు అగుచున్నారు) "క్రీ.శ.1944లో నేను కళాశాలకు పునాది వేసియుంటిని. ఎందునగా మన భావి తరాల ఉన్నత విద్య మన చేతిలో యున్నది. ఒకప్పుడు మన జమాఅత్‌లో చాలా చిన్న పదవి, అతి కొద్ది ఆదాయము గల వారుండేవారు." (నిస్సందేహముగా దీనితో జమాఅత్ చరిత్ర కూడ తెలియును.) నిస్సందేహముగా కళాశాలలో చదివేవారు కూడ కొందరు అహ్మదీయులైనారు. కాని వారు అరుదుగా భావించబడిరి. అతి కొందరు తప్ప గొప్ప పదవీదారులు, అధిక ఆదాయము అర్జించువారు జమాఅత్‌లో చాలా తక్కువే యున్నారు. ఒక వ్యాపారస్తులు సేట్ అబ్దుర్రహ్మాన్ హాజి అల్లాహ్ రఖా గారు మద్రాసి యుండిరి. కాని వారి వ్యాపారము కూడ క్షీణించెను. వారి తర్వాత షేఖ్ రహ్మతుల్లాహ్ గారు గడిచిరి. వారు తప్ప మరెవ్వరు గొప్ప వ్యాపారస్తులు మన జమాఅత్‌లో లేకుండిరి. ఏ ఉన్నత పదవి గల వ్యక్తి కూడ లేకుండెను. హజ్రత్ ఖలీఫా అవ్వల్ ఒక సారి నాతో ఇట్లనిరి. చూడు బాబు! సందేశహరులను ఆరంభములో పెద్ద వ్యక్తులు విశ్వసించరని ఖుర్‌ఆన్, హదీస్ ద్వారా తెలియును. కనుక మన జమాఅత్‌లో

**ప్రవచనములు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం**

"క్రమం తప్పకుండా నమాజులు చదవండి. కొందరు ఒక్క పూట మాత్రమే నమాజ్ చేస్తారు. నమాజులకు మినహాయింపు లేదని వారు గుర్తుంచుకోగలరు. ఎందుకనగా ప్రవక్తలకు కూడ నమాజులు మినహాయించబడలేదు. ఒక హదీసులో ఇట్లు గలదు. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు ఒక సమూహము వచ్చి నమాజులలో మినహాయింపు కావాలని వేడుకొనిరి. బదులుగా వారిట్లనిరి. ఏ మతములో ఆచరణ లేదో అది వ్యర్థమే. కనుక ఈ విషయమును గట్టిగా గుర్తుంచుకొని అల్లాహ్ తాలా ఆదేశముల ప్రకారము నడుచుకొనుము." (మల్ఫూజాత్ సంపుటి 1 పుట 263)

దుఆ ఆశించువారు
**SUFI AHMAD** Jama'at Ahmadiyya Penugonda, Dist: West Godawari (Andhra Pradesh)

ఏ పెద్ద వ్యక్తి లేకపోవడం కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్యమునకు నిదర్శనము. ఒక్క ఈ.ఏ.సి. మన జమాఅత్‌లో లేదు. ఈ విధముగా ఇ.ఏ.సి (ఇది ప్రభుత్వ ఉద్యోగుల విధానములో అసిస్టెంట్ కమీష్నర్‌ను అందురు కావచ్చు) చాలా పెద్ద వ్యక్తిగా భావించబడేది." హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్‌హు ఇట్లనిరి. కానిప్పుడు చూడుము. ఈ.ఏ.సి.లు వీధులలో తిరుగుచున్నారు. వారి వైపు ఎవరు కన్నెత్తి కూడ చూడరు. ఒకప్పుడు మన జమాఅత్‌లో పెద్దవారు చాలా తక్కువ యుండిరి. తుదకు మన జమాఅత్‌లో ఏ పెద్ద వ్యక్తి లేడు. మన జమాఅత్ ఒక్క ఈ.ఏ.సి.ని కూడ భరించలేదని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ అవ్వల్ అనిరి."(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 27 పుట 150-153)

నేడు అల్లాహ్ కృపానుసారము ప్రపంచములో వందలాది పాఠశాలలు, కళాశాలలు జమాఅత్ నడుపుచున్నది. అల్లాహ్ కృపానుసారము ప్రపంచములోని వివిధ దేశములలో పెద్ద పెద్ద నిపుణులు, అధికారులు యున్నారు. అహ్మదీయులు దేశ పార్లమెంట్ సభ్యులుగా కూడ యున్నారు. విధేయతలో కూడ క్రియాశీలకంగా యున్నారు. ప్రాపంచికములోనే కాదు ఆధ్యాత్మికతలో కూడ ముందున్నారు. ఆఫ్రికాలోని పలు దేశములలో కొందరు అహ్మదీయులు ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను నిర్వహించుచున్నారు. ఇది కూడ అల్లాహ్ శుభములలో ఒక శుభము. ఏ విధముగా అల్లాహ్ ప్రగతి అందించుచున్నాడు.

ప్రారంభ అహ్మదీయులు ఎదుర్కొన్న కఠినములను, చాలా ఆరంభ కాలములోని దైవానుగ్రహములను వివరించుచు వారిట్లనిరి. "ఒకప్పుడు అహ్మదియ్య జమాఅత్‌ను నలు వైపుల నుండి హింసించేవారు." "అహ్మదీయులను హతమార్చుట, వారి గృహములను దోచుకొనుట, వారి ఆస్తులను వశపరచుకొనుట, వారి స్త్రీలకు విడాకులు ఇవ్వకుండానే మరో చోట వివాహము చేయుట ధర్మబద్ధమే కాదు, పుణ్యకారణమని మౌల్వీలు తీర్పు నిచ్చిరి. (నేడు కూడ ఇది జరుగుచున్నది. కాని ఆ కాలములో చాలా బీదలుండిరి. చాలా కఠినముగా వ్యవహరించేవారు. ఈ వ్యవహారము మౌల్వీలతో ఎల్లప్పుడు జరగినది. నేటి వరకు కొనసాగుచున్నది. కాని ఆ కాలములో జమాఅత్ అతి తక్కువ వున్నందున కఠినము తారాస్థాయికి చేరి యుండెను. ఇట్లనిరి) తమ ఆశ, ఈర్ష్యలను పూర్తి చేసుకొనుటకు సాకులు వెతికే దుష్టులు, దురుద్దేశులు ఈ తీర్పును పాటించడం మొదలు పెట్టిరి. (నికాహ్ చేసుకోకుండానే స్త్రీలను ధర్మబద్ధం చేసుకొనిరి. అనగా అహ్మదీయుల నుండి విడాకులిప్పించి తాము నికాహ్ చేయించుకొనిరి. ఇట్లనిరి.) "అహ్మదీయులు గృహముల నుండి వెడలగొట్టబడి ఉద్యోగముల నుండి తొలగించబబడుచుండిరి." (అహ్మదీయులు గృహముల నుండి వెడలగొట్టబడి ఉద్యోగముల నుండి తొలగించబడుచుండిరి.) "వారి ఆస్తులను బలవంతముగా వశపరచుకొనుచుండిరి. అనేకులు ఈ జగడమాడువారితో మోక్షము పొందే స్థితి కనిపించక విధి లేక ప్రస్థానము చేసేవారు. ప్రస్థానమునకు ఖాదియానే వారికి కనిపించేది. వారు ఖాదియాన్ రావడంతో అథితుల ఖర్చులు మరింత ప్రగతి చెందినవి." (పెరిగినవి. "అప్పుడు జమాఅత్ ఒక్క వెయ్యి రెండు వెయ్యిల వరకు ప్రగతి చెందెను. కాని వారిలో ప్రతి ఒక్కరు హింసకు గురయ్యేవారు". (జమాఅత్ సంఖ్య ఒక్క వెయ్యి రెండు వేల వరకు చేరి యుండెను. కాని ప్రతి ఒక్కరు శత్రువు హింసకు గురయ్యేది) "ఒక్క వెయ్యి రెండు వేల మంది అనుక్షణం తమ ప్రాణము, తమ గౌరవము, తమ ఆస్తి, తమ ధన రక్షణ వ్యాకులతలో యుండేవారు, దివారాత్రులు ప్రజలతో చర్చలు, వివాదములలో నిమగ్నమై యుండేవారు. ప్రపంచమంతటా ఇస్లాం ప్రచారము కొరకు వారు ధనము చెల్లించుట, ధర్మము నేర్చుకొనుటకు ఖాదియాన్ వచ్చేవారి కొరకు అథిత్య భారమును మోయుట, ఇంకా తమ పీడిత వలస సోదరుల ఖర్చులను భరించుట ఒక ఆశ్చర్యకరమైన విషయము." (ఈ చరిత్ర కూడ మనకు తెలిసియుండవలెను. సాధారణ విషయము కాదు) "వందలాది మంది రెండు పూటలు జమాఅత్ సంత్రంలో భోజనం చేసేవారు. పలువురు ఇతర నిరుపేదల అవసరముల ఏర్పాటు కూడ చేయవలసి వచ్చును. ప్రస్థానము చేసి వచ్చేవారి అధిక సంఖ్య, అధిక అథితుల వలన అథితి గృహము కాక ప్రతి ఒక్కరి గృహములో (ఖాదియాన్‌లో) అథితి గృహముగా మారేది."

"హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గృహములోని ప్రతి గది శాశ్వత అథితి గృహముగా మారేది." (అనగా ప్రతి గదిలో కుటుంబము నివాసముండెడిది. అనగా ఒక్కొక్క గది ఒక్కొక్క కుటుంబమునకు లభించియుండెను. గృహముగా మారి యుండెను.) "అందులో ఎవరో ఒకరు వలసదారులు, కుటుంబము యుండెడిది. అనగా భారము మానవుని శక్తి కంటే మించి పెరిగి యుండెను. ఉదయించు ప్రతి ఉదయము తనతో క్రొత్త క్రొత్త ఆపదలను, క్రొత్త క్రొత్త బాధ్యతలను తీసుకొని వచ్చేది. అస్తమించు ప్రతి సాయంత్రము తనతో క్రొత్త క్రొత్త ఆపదలు, బాధ్యతలను తీసుకొని వచ్చును. కాని أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهُ మధురమైన గాలి అన్నిటిని కట్టెపుల్ల వలే మటుమాయము చేసేది. జమాఅత్ భవనములను పెకిలి వేయుదుమని హెచ్చరించిన మేఘములను కొద్ది సమయములోనే అల్లాహ్ కృప, దయ రూపంలో మారిపోయేది. వాటి ఒక్కొక్క చినుకు కురుస్తూ أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهُ ద్వారా ధైర్యము కల్పించేది."

అనగా ఇంత కఠిన పరిస్థితిలో కూడ అల్లాహ్ మాకు సరిపోవును, పరిస్థితులు انشاءالله మారిపోవునని నమ్మకముండేది. నేడు కూడ పాకిస్తాన్‌లో ప్రత్యేకముగా ఇతర దేశములలో పరిస్థితులు ఇబ్బందికరముగా యున్నవి. అయినను అప్పటి భీకర స్థితి లేదు. ఆర్థికముగా కూడ మెరుగ్గా యున్నారు. ఇతర ఏర్పాట్లు కూడ అల్లాహ్ తాలా కృపానుసారము చాలా మెరుగ్గా యున్నవి. అల్లాహ్ శుభములు బహిర్గతమగుచున్నవి. అల్లాహ్ తాలా కృపానుసారము అహ్మదియ్యత్ ప్రపంచ కోణములకు వ్యాపించినది. ప్రస్థానము చేసి ఒక్క చోట ఏరడం లేదు. అహ్మదీయులు ప్రపంచములో వ్యాపించుచున్నారు. కొరత ఏర్పడినచో బయటకు వెళ్లగా అల్లాహ్ తాలా కృపానుసారము సౌకర్యములు కలుగుచున్నవి. కొన్ని ఆపదలు వచ్చినను أَلَيْسَ اللّٰهُ بِكَافٍ عَبْدَهُ ఆదుకొనును. నేడు కూడ మనకు ఆసరాగా నిలుచుచున్నది. ప్రపంచ నలు మూలలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్రములు కొనసాగుచున్నవి. మనము అల్లాహ్‌తో స్మరించినచో అల్లాహ్ ఎన్నడు వీడలేదు, انشاءالله వీడడు కూడ. నిస్సందేహముగా త్యాగములు సమర్పించవలసి యుండును. అహ్మదీయులు అల్లాహ్ కృపానుసారము ఇచ్చుచున్నారు కూడ. కాని ప్రతి త్యాగము మనకు ఒక నూతన మార్గమును చూపును. అల్లాహ్ ప్రసాదించుటలో ఎలాంటి లోపము రానివ్వడు.

దైవ రక్షణ మహిమ గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక సంఘటన ఇట్లు తెలిపిరి. "దైవ రక్షణ ఉదాహరణలో భాగంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితములోని ఒక సంఘటనను ప్రస్తావింతును. లా కాలెజ్ లాహోర్ ప్రిన్సిపల్ కుంవర్ సేన్ తండ్రికి హజ్రత్ గారితో సత్సంబంధముండెను. ఎంత వరకనగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంనకు ఎప్పుడైనా నగదు అవసరమున్నచో వారితో రుణము తీసుకునేవారు. (ఈ కుంవర్ సేన్ గారు హిందువులు.) వారికి కూడ హజ్రత్ గారి పట్ల ఎంతో అభిమానముండెను.

జీలం వాజ్యములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరపున వాదించాలని వారు తమ కుమారునికి టెలిగ్రామ్ పంపిరి. ఈ అభిమానమునకు కారణమేమనగా యవ్వనంలో వారు మరి కొందరు మిత్రులతో కలిసి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వెంట సియాల్కోట్‌లో నివాసముండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ద్వారా అనేక సంకేతములను చూచిరి. ఆ సంకేతములలో ఒక సంకేతము ఏమనగా ఒక రాత్రి వారు (అ) మిత్రులతో కలిసి నిద్రించుచుండిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రాత్రి నిద్ర లేచిరి. గృహములో ప్రమాదమున్నదని వారికి ఆలోచన కల్పించబడెను. మిత్రులందరిని లేపి గృహములో ప్రమాదమున్నది, కనుక బయటికి వెళ్లవలెనని అనిరి. నిద్ర వలన మీకు అనుమానము కలిగినదని మిత్రులందరు మరల నిద్రించిరి. కాని వారి ఆలోచన పెరిగినది. మరల మిత్రులను లేపి పై కప్పులో బెనికిన శబ్దము వచ్చుచున్నది. గృహమును ఖాళీ చేయాలని అనిరి. మీరు మా నిద్రను ఎందుకు పాడు చేయుచున్నారు. కొన్ని కట్టెలలో ఇటువంటి శబ్దము

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9493113322
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail: badartel001@gmail.com

REGISTERED WITH THE REGISTER OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ వార పత్రిక
Distt: Gurdaspur (Pb.) INDIA Qadian - 143516 ఖాదియాన్
POSTAL REG NO GDP-38/2017-2019, Vol. 4. Thursday, 01 AUG 2019 Issue No. 31

MANAGER
NAWAB AHMAD
Tel : +91-1872-224757
Mobile. : +91 94170-20616
e-mail:managerbadrqnd@gmail.com
website:www.akhbarbadarqadian.in
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.500/- (Per Issue: 9/- ) (WEIGHT: 20-50, grms / issue)

కీటకముల వలన వచ్చును. ఇది సాధారణ విషయమేనని మిత్రులనిరి. సరే మీరు నా మాట వినే బయటికి వెళ్లండని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం పట్టుదలతో అనిరి. తుదకు మిత్రులు విధిలేక బయటికి వెళ్లిరి. నా వల్లనే అల్లాహ్ ఈ గృహమును ఇంకా పడకుండా ఆపినాడని వారికి నమ్మకమున్నందున ముందు మీరు బయటికి వెళ్లండి తర్వాత నేను వస్తాను అనిరి. మిత్రులు బయటికి వచ్చిన తర్వాత వారు ఒక్క పాదము మెట్లపై పెట్టగానే పై కప్పు పడిపోయినది. చూడండి! పై కప్పు స్థితిని చూచి ఇది పడునని అర్థము చేసుకొనుటకు వారు ఇంజనీర్ కాదు. ఇంకా వారు బలవంతముగా ప్రజలను నిద్రలేపినంత వరకు పై కప్పు తన స్థానములో అలాగే యున్నది. వారు బయటికి వెళ్లనంత వరకు అది పడిపోలేదు. కాని వారు పాదము లేపగానే పై కప్పు పడిపోయినది. ఇదేదో అనుకోకుండా జరిగినది కాదు. రంక్షించే ఉనికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను రక్షించదలచెను. అందుకే వారు బయటికి వచ్చిన తర్వాతనే అది కుప్పకూలినది. కనుక రక్షించు ఉనికి లక్షణమునకు ఇది సాక్ష్యము. అందుకు ఒక సజీవ సాక్షి గలడు."(హస్తి బారీ తాలా – అన్వారుల్ ఉలూమ్ సంపుటి 6 పుట 324,325)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో అల్లాహ్ చూపిన మరో సంఘటనను ప్రస్తావించుచు ఇట్లనిరి. "హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వయముగా ప్రస్తావించేవారు. ఒక సారి నేను అమృత్సర్ నుండి బటాలాకు వచ్చుటకు టాంగాలో ఎక్కినాను. ఒక భారీ శరీరము గల హిందువు కూడ నాతో టాంగాలో కూర్చొనెను. అతడు నా కంటే ముందు టాంగాలో కూర్చున్నాడు. తన సౌకర్యము కొరకు తన పాదములను మంచిగా చాపినాడు. తుదకు నేను కూర్చొనే ముందటి చోటును కూడ ఆక్రమించుకొనెను. (అందులో కూడ ఆటంకము కలిగించెను) కనుక (హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి) నేను చాలా కొద్ది స్థలములో కూర్చున్నాను. ఆ రోజులలో వ్యక్తి స్పృహ కోల్పోయే స్థితిలో ఎండ తీవ్రముగా పడుచుండెను. నన్ను ఎండ నుండి రక్షించుటకు అల్లాహ్ (ఏమి చేసినాడనగా) ఒక మేఘమును పంపెను. అది టాంగాపై నీడ పరుచుచుమా వెంట బటాలా వరకు వచ్చెను. ఈ దృశ్యమును చూచి మీరు అల్లాహ్ సమీపులుగా కనిపించుచున్నారని ఆ హిందువు అనెను."

(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 17 పుట 534,535)

మానవుడు ఆశ్చర్య పడే విధముగా అల్లాహ్ తన దాసులతో వ్యవహరించును. కాని ఆరాధన అనే నిబంధన గలదు. ఇటువంటి వ్యక్తి అంతము తప్పక శుభమగును. బాహ్యముగా అతడు ప్రాపంచిక వ్యక్తుల దృష్టిలో అవమానమును ఎదుర్కొనును. కాని తుదకు అతడు సత్కారము పొందును. బాహ్యముగా అతడు నిందకు గురికావచ్చును. కాని తుదకు అతడు సత్కార్యుడని తేలును. ఒక రకంగా అతని ఆరంభము ఆరాధన కాగా అతని అంతము సహాకారమగును." అనగా అల్లాహ్ సరియైన దాసుడై అతన్ని ఆరాధాంచినచో, అతని దాసునిగా యున్నచో అల్లాహ్ సహాయము వెంట యుండును. అల్లాహ్ తాలా ప్రతి దుష్టమునకు వ్యతిరేకముగా సహకరించును.

తన శిశువులపై మంచి ప్రభావము వేయుట, సత్కార్యములను పంచి పెట్టుట, శిశువుల శిక్షణ, మానవత్వము పట్ల కలత విషయములో ఒక సాధారణ బోధకుడు, అల్లాహ్ పంపిన అవతారుని మధ్య చాలా వ్యత్యాసముండును. దీనిని ఒక ఉదాహరణతో వివరించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు అన్హు ఇట్లనిరి. హజ్రత్ మున్షి అహ్మద్ జాన్ లుధ్యానా గారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ప్రకటన చేయక ముందే మృతి చెందిరి. కాని వారి ఆధ్యాత్మిక కాంతి చురుకుగా వున్నందున ప్రకటన కంటే ముందే వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను ఇట్లు వ్రాసిరి.

ہم مریضوں کی ہے تم ہی پہ نگاہ تم مسیحا بنو خدا کیلئے

అనగా మా లాంటి రోగుల చూపు మీపైనే యున్నది. మీరు అల్లాహ్ కొరకు మసీహా (వైద్యులు) కాగలరు.

వారు (అనగా మున్షి అహ్మద్ జాన్ గారు) తమ సంతానమునకు ఉపదేశించిరి. నేనిప్పుడు మరణించుచున్నాను. కాని మిర్జా గారు ఒక ప్రకటన తప్పక చేయుదురను విషయమును మంచిగా గుర్తుంచుకొనుము. మిర్జా గారిని తప్పక స్వీకరించవలెని నేను మీకు మరణాదేశమిచ్చుచున్నాను. అనగా వారింత స్థాయి ఆధ్యాత్మిక మహాపురుషులై యుండిరి. వారు 12 సం॥ల వరకు తమ బోధకుని సేవలో ఎడ్లతో నడిచే గిర్ని నడిపిరి." (బోధకుడు ఎద్దు స్థానమున వీరిని పెట్టినారు కావచ్చును.) "12 సం॥ల వరకు అతని కొరకు పిండి పట్టిరి. అప్పుడు వారు ఆధ్యాత్మిక పాఠములు నేర్పసాగిరి." (అనగా 12 సం॥ల వరకు ఎద్దు వలె గిర్నిలో పిండి పట్టిన తర్వాత వారికి ఆధ్యాత్మిక పాఠములు నేర్పసాగిరి.) ఇట్లనిరి. "అప్పుడు ఆధ్యాత్మికులనబడేవారు (ఆ కాలపు గురువులు, ఆధ్యాత్మికులనేబడే వారు) కూడ ప్రజలకు ఆధ్యాత్మిక విషయములు బోధించుటకు చాలా లోభితనముతో వ్యవహరించేవారు. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆ విషయములన్నిటిని ప్రపంచమునకు చెప్పడమే కాకుండా వారి కంటే వేల రెట్లు అధికముగా చెప్పిరి. ప్రజలకు తెలియని విషయములు చెప్పిరి. ఈ విధముగా విద్యలను వారు ప్రపంచమంతటా వ్యాపింపజేసిరి. కాని హదీసులలో తెలిపినట్లు ప్రపంచము వాటిని గౌరవించలేదు.(ఖుత్బాతె మహ్మూద్ సంపుటి 25 పుట 23,24)

ప్రపంచమును సవరించి, అల్లాహ్‌కు చేరువగా చేయుచుటకు పంపిన వ్యక్తులతో సాధారణ, బాహ్య స్థితిలో బోధకులైన వారు వ్యక్తులు పోటీ పడలేరు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్వయముగా ఇట్లు ఉపదేశించిరి. "అల్లాహ్ అతని సృష్టిలో ఏర్పడిన అంతరమును దూరము చేసి ప్రేమానురాగ, అభిమాన బంధమును మరల ఏర్పాటు చేయుటకు అల్లాహ్ నన్ను నియమించెను."

వారిట్లనిరి. "ప్రపంచ తెర నుండి కనుమరుగైన ధార్మిక సత్యములను బహిర్గత పరచుటకు, మానసిక అంధకారముల క్రింద నలిగిపోయిన ఆధ్యాత్మికతను చూపుటకు."

ఇట్లనిరి. "అన్నిటి కంటే కాంతివంతమైన దైవ ఏకత్వమును ఆన్యారాధన కలుషితము నుండి పవిత్రము చేసి ప్రపంచములో మరల శాశ్వతముగా నాటుటకు."

(లెక్చర్ లాహెూర్ – రూహాని ఖజాయిన్ సంపుటి 20 పుట 180)

బైఅత్ హక్కును చెల్లించుచు అల్లాహ్‌తో సరియైన సంబంధము ఏర్పాటు చేసుకొనుటకు అల్లాహ్ మనందరిని అనుగ్రహించుగాక! ధార్మిక సత్యములను గుర్తించి వాటిని అమలు చేయువారమగుదుము గాక! ఆధ్యాత్మికతలో ప్రగతి చెందువారమగుదుము గాక! నిజమైన దైవ ఏకత్వముతో కాంతిని పొందువారమగుదుము గాక! అల్లాహ్ ప్రపంచమును కూడ దీనిని గురించే అనుగ్రహమివ్వుగాక! ప్రత్యేకముగా ముస్లిం సమాజము కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కలతను, బాధను గ్రహించుచు వారి బైఅత్‌లో చేరు అనుగ్రహము కల్గించుగాక!

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz